
తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర
# విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




హైదరాబాద్ | సంపుటి : 5 | సంచిక : 313 | ఎడిటర్ - డా. బి. అనిల్ కుమార్ | మంగళవారం 26.05.2026 | పేజీలు : 12 | వెల : 6/-

# టార్గెట్ 2034



- కార్పొరేట్ స్థాయిలో 'ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు'
- మండలానికి రైస్ మిల్లులు, గోడౌన్లు: దళారీ వ్యవస్థకు చెక్!
- 8 వేల స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన.. పెరిగిన బ్యాంకు రుణాలు
- మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు..

## కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ సర్కార్ ధ్యేయం!



విజేత, హైదరాబాద్, మే 25 : తెలంగాణ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరిన్ని కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో 'ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు' ప్రారంభించడానికి వీలుగా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అందించే ఇందిరమ్మ ...

2

## హైకోర్టు న్యాయవాది హత్య కేసులో కొత్త విషయాలు

- రూ.10 లక్షల సుపారీతో న్యాయవాది మొయినుద్దీన్ హత్య
- వినయ్ గ్యాంగ్‌తో హత్యకు ఒప్పందం కుదుర్చుకున్న కిషన్
- కారుతో ఢీకొట్టి 20 మీటర్లు లాక్కెళ్లి కిరాతకంగా హత్య
- హత్య వెనుక వక్ఫ్ భూముల వివాదం ఉన్నట్లు అనుమానం



2

## ఖమ్మం జిల్లా గోదావరి కల సాకారం కాబోతోంది : తుమ్మల

**యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన తుమ్మల నాగేశ్వరరావు**

**15 నెలల్లోనే టన్నెల్ నిర్మాణం పూర్తయిందని వెల్లడి**

**యుద్ధ ప్రభావం వల్ల గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి నెలకొందన్న మంత్రి**



విజేత, ఖమ్మం, మే 25 : తెలంగాణలో వరి ధాన్యం కొనుగోళ్లపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిప్పికొట్టారు. ఖమ్మం జిల్లాలోని యాతాలకుంట టన్నెల్ పనులను మంత్రి ఈరోజు పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... దేశంలో అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్న ఏకైక...

2

## కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్..
### - పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

**ఎస్ఐఆర్ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చిన కేటీఆర్**

**డూప్లికేట్ ఇట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నగరంలో 24 గంటల పాటు తాగునీరు ఇస్తామని హామీ**

2




## ఇంధన ధరల పెంపు..
### ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం
### - నిర్మలా సీతారామన్



విజేత, న్యూ ఢిల్లీ, మే 25 దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభు త్వం దాదాపు లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావు లేదని స్పష్టం చేశారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే. ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

## నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్
### - రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు

- ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన హరీశ్ రావు
- రోహిణి కార్తె వచ్చినా ధాన్యం ఇప్పటికీ కళ్లాల్లోనే ఉందని ఆవేదన
- రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్



విజేత, . సిద్దిపేట అర్బన్ , మే 25 : తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందగించిందని, ఐకేపీ సెంటర్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, వరి ధాన్యాన్ని పరిశీలించి అక్కడి రైతుల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు. రైతులకు సాగునీరు, కరెంట్, యూరియా అందించడం దగ్గరి నుంచి పండిన పంటను సేకరించే వరకు ప్రభుత్వం ప్రతి దశలోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని హరీశ్ రావు విమర్శించారు. రోహిణి కార్తె ప్రవేశించినా సరే, ఇప్పటికీ ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడం, రైతులు ఎండనక వాననక అరిగోస పడటం రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ చూడలేదన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు....

2

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..
### రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!

**ఐఆర్ఎఫ్‌సీతో రూ.13,600 కోట్ల డీల్**

**20 ఏళ్ల పాటు చెల్లింపుల వెసులుబాటు**

**ప్రభుత్వానికే మెట్రో 100 శాతం వాటా**

**నగరంలో మరింత పెరగనున్న మెట్రో విస్తరణ**



విజేత, హైదరాబాద్, మే 25 : హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC) ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు...

2

# టార్గెట్ - 2034

మొదటిపేజీ తరువాయి..
చీరల డిజైన్లను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

**ముఖ్యమంత్రి ప్రకటించిన ముఖ్యాంశాలు మరియు ప్రణాళికలు క్రింది విధంగా ఉన్నాయి:**

**నియోజకవర్గాల్లో సూపర్ బజార్లు & కార్పస్ ఫండ్ :**
మొదటి విడతగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం అవసరమైన స్థలాన్ని గుర్తించి, మహిళా సంఘాలకు నామినల్ అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడానికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సూపర్ బజార్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కార్పస్ ఫండ్ ఇస్తామని, సంఘాల్లోని ప్రతి మహిళ కొంత మేరకు పెట్టుబడిని సమకూర్చుకోవాలని సూచించారు. కార్పొరేట్ కంపెనీల చైన్ సూపర్ బజార్ల తరహాలోనే, నాణ్యమైన వస్తువులకు 'మహిళా శక్తి బజార్లు' కేరాఫ్ అడ్రస్‌గా మారి, దేశంలోనే అత్యుత్తమ బ్రాండ్ ఇమేజీని సాధించాలని ఆకాంక్షించారు.

**మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణం**
మహిళలు వ్యాపార రంగంలో రాణించడానికి ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

"కొంతమంది మిల్లర్లు, దళారులు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. ఈ బాధ్యతలను ఆడబిడ్డలకు ఇవ్వడం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుంది. భవిష్యత్‌లో ప్రతి మండలంలో 2 నుండి 4 స్థలాలను గుర్తించి పెద్ద గోడౌన్లు నిర్మించాలి. ధాన్యాన్ని వాటిల్లో భద్రపరిస్తే, మిల్లర్లే నేరుగా మహిళల దగ్గర నుండి తీసుకెళ్లేలా చేస్తాం. వీటికి అవసరమైన రుణాలను జీరో వడ్డీతో బ్యాంకు లింకేజీ ద్వారా ఇప్పించే పూచీ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన**



"ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం ఒకే రోజు 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దేశంలోనే ఇది ఒక గొప్ప కార్యక్రమమని పేర్కొంటూ, ఇందుకు కృషి చేసిన మంత్రులు, అధికారులను అభినందించారు. ఈ వారంలోనే ఇందిరాగాంధీ స్త్రీ శక్తి అంగన్ వాడీ భవనాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**మహిళా సాధికారతకు ప్రభుత్వం తీసుకున్న కీలక చర్యలు**

**ఉచిత బస్సు ప్రయాణం:** ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా గత 29 నెలల్లో రూ. 10 వేల కోట్లకు పైగా మొత్తాన్ని ప్రభుత్వం సంస్థకు చెల్లించింది.

**మహిళా సంఘాలకు బస్సులు:** మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కేటాయించి, అద్దె రూపేణా నెలకు రూ. 70 వేల ఆదాయం వచ్చేలా ప్రణాళికలు వేశారు. ఇందులో భాగంగా జూన్ 5వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి మరో 553 బస్సులను అందించబోతున్నారు.

**బ్యాంకు రుణాల పెంపు & జీరో వడ్డీ:** మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల లింకేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. మహిళా సంఘాల రుణాలపై జీరో వడ్డీ కింద ప్రభుత్వం ఇప్పటికే రూ. 1,390 కోట్లు చెల్లించింది. ఈ చెల్లింపుల్లో నూటికి నూరు శాతం పూర్తి చేసిన నిర్మల్ జిల్లా మహిళలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

**వీ-హబ్ ద్వారా బిజినెస్ ఇంక్యుబేటర్:** మహిళలు వ్యాపారాల్లో రాణించడానికి మరియు వారి వ్యాపారాలను వృద్ధి చేసుకోవడానికి వీలుగా ఈ నెల 29న 'వీ-హబ్' ద్వారా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ కింద అవసరమైన బిజినెస్ ప్లాన్లను అందించే కార్యక్రమం ప్రారంభం కానుంది.

**పంటల మార్పిడిపై అవగాహన**
ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాల మహిళా ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడిన ముఖ్యమంత్రి, వ్యవసాయ రంగంలో అధిక లాభాలను ఆర్జించిపెట్టే 'పంటల మార్పిడి' విధానం గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని మహిళా సంఘాలను కోరారు.

**ముగింపు వ్యాఖ్య:**
"2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం. ఈ మంత్రిమండలి మొత్తం రాష్ట్రంలోని మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావిస్తూ, వారు స్వశక్తిపై నిలబడి ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా సంపూర్ణ సహకారం అందిస్తుంది" అని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

## కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్..
### - పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

విజేత, హైదరాబాద్ : కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు నమోదు చేయిస్తున్న దొంగ, డూప్లికేట్ ఓట్ల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్క ఓటరును కోల్పోకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో తెలంగాణకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, అదే రీతిలో నగరానికి నిరంతర మంచి నీరు అందించేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మార్కు పరిపాలనపై పూర్తి అవగాహన ఉండబట్టే, నగర ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలను ఇప్పుడు కాంగ్రెస్ నేతలు ఓపెన్ చేస్తూ... తామే కట్టామంటూ అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని, అయితే ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు,



నాయకుడికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## ఖమ్మం జిల్లా గోదావరి కల సాకారం కాబోతోంది : తుమ్మల

విజేత, హైదరాబాద్ : రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు విధానాలే కారణమని ధ్వజమెత్తారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల రాష్ట్రానికి గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని, రవాణాకు అవసరమైన డీజిల్ కొరత వల్ల ఎక్కడికక్కడ ధాన్యం నిలిచిపోయిందని ఆరోపించారు. కేంద్రం ఇలాంటి ఇబ్బందులు సృష్టిస్తుంటే, సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, చివరి గింజ వరకు కొంటామని భరోసా ఇచ్చారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు



లేదన్నారు. ఇక సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం తన జీవిత ఆశయమని, చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. గత కేసీఆర్ హయాంలో యాతాలకుంట టన్నెల్ పూర్తి చేయడానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు, ఆ తర్వాత యాతాలకుంట టన్నెల్‌కు అనుమతులు ఇచ్చారని, కేవలం 15 నెలల్లోనే రెండు కిలోమీటర్ల పొడవున్న ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. ఆగష్టు 15వ తేదీ లోగా లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అటు సాగర్ ఆయకట్టు, ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా కృష్ణా-గోదావరి జలాలతో త్వరలోనే సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.

## నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్
### - రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు

మొదటిపేజీ తరువాయి..
"మొన్నేమో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటాం అనడం ఎంతవరకు సబబు? రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే.. మిగిలిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలి?" అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం ఆపి, వారి మెడలు వంచైనా సరే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. "తాలు పెడితే తోలు తీస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు ఏకంగా 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ జాప్యం వల్ల వరి కుప్పలపైనే గుండెలు బాదుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ధాన్యాన్ని 'మిషన్ మోడ్'లో కొంటున్నామనే సీఎం వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. ఇది మిషన్ మోడ్ కాదు, పూర్తిగా 'కమీషన్ మోడ్' అని ఆరోపించారు. నిన్న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన నిర్ణయం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. 45 రోజుల్లో రైతుబంధు నిధులు వేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి, 60 రోజులు గడిచినా వేయకుండా మాట తప్పారని, రేవంత్ రెడ్డి కేవలం ఒక "పేపర్ టైగర్" మాత్రమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి తన ఢిల్లీ ట్రిప్పులను పక్కనబెట్టి, కళ్లాల్లో ఉన్న వడ్లను తరలించడానికి లారీల ట్రిప్పులను పెంచాలని హితవు పలికారు. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని హరీశ్ రావు హెచ్చరించారు. ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లలో మార్పు రాకపోతే, స్వయంగా తానే సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని స్పష్టం చేశారు. అలాగే వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.

## హైకోర్టు న్యాయవాది హత్య కేసులో కొత్త విషయాలు

మొదటిపేజీ తరువాయి..
తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది రూ.10 లక్షల సుపారీ ఇచ్చి చేయించిన హత్య అని పోలీసుల దర్యాప్తులో తేలింది. కిషన్ అనే వ్యక్తి ద్వారా వినయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ముఠాతో ఈ హత్యకు ఒప్పందం కుదిరినట్లు పోలీసులు గుర్తించారు. ఈ హత్య కోసం నిందితులు ఆరు నెలల క్రితమే సెకండ్‌హ్యాండ్ కారును కొనుగోలు చేశారు. న్యాయవాది కదలికలపై చాలాసార్లు రెక్కీ నిర్వహించారు. చివరకు ఆయన ఇంటి వద్దే కారుతో ఢీకొట్టి, సుమారు 20 మీటర్ల దూరం లాక్కెళ్లి కిరాతకంగా చంపేశారు. ఈ దారుణ దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో స్పష్టంగా రికార్డయ్యాయి. వక్ఫ్ భూముల వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన అనుమానితుడైన వినయ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటన తర్వాత నిందితులు గోవా, కల్వకుర్తికి పారిపోగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..
### - రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్..!



మొదటిపేజీ తరువాయి..
ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అక్షిత వెంచర్లో కల్వర్టు ఒకవైపు కాలువ మరొకవైపు

- సెట్ బ్యాక్ లేకుండా పూర్తిగా రోడ్డు వరకు వెంచర్ నిర్మాణం
- భారీ వర్షం పడితే అక్షిత వెంచర్ నీటిలో మునగడం ఖాయం
- అక్షిత వెంచర్ కు హెచ్ఎండిఏ అధికారులు ఎలా పరిమిషన్ ఇచ్చారో
- వెంటనే అక్షిత వెంచర్ పై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజల డిమాండ్





విజేత మహేశ్వరం : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రం తుమ్మలూరు కు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న అక్షిత వెంచర్ కారణంగా పొట్టి కుంట పూర్తిగా కనుమరుగవుతుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎండిఏ అధికారులు ఏ విధంగా వెంచర్ కు పర్మిషన్ ఇచ్చారు అర్థం కావడం లేదని స్థానిక ప్రజలు అంటున్నారు. భారీ వర్షం పడితే పూర్తిగా వెంచర్ మునిగిపోతుందని అదేవిధంగా అక్షిత వెంచర్ కల్వర్టు ఒకచోట ఉంటే వర్షపు కుంట నీరు బయటకెళ్లే కాలువ మరొకచోట చేశారు. అదేవిధంగా రోడ్డుకు సెట్ బ్యాక్ వదలకుండా పూర్తిగా రోడ్డు దగ్గర వరకు ప్లాట్లను చేశారు. అక్షిత వెంచర్ ఇష్టానుసారంగా చేస్తున్న రెవెన్యూ అధికారులకు కానీ గ్రామపంచాయతీ అధికారులు కానీ ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హెచ్ఎండి అధికారులు ఏమి చూడకుండానే పర్మిషన్ ఇచ్చారా... అక్షిత వెంచర్ ఇష్టానుసారంగా చేసుకుంటూ పోతుంటే ఇక్కడ ప్రజలకు స్థానికులకు ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. ఇటీవల భారీ వర్షం పడినప్పుడు పొట్టి కుంట లోకి మీరు వెళ్లాల్సి ఉండగా అక్కడ వెంచర్ అడ్డుగా ఉండడంతో వర్షం మీరు మొత్తం ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయింది. దీని కారణంగా వాహనదారులకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ప్రమాదాలు ఏర్పడ్డాయి ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో చాలా ప్రమాదం ఏర్పడుతుందని వెంచర్ నిర్మాణం జరిగి భవిష్యత్తులో అక్కడ ఇల్లు ఏర్పడ్డ మరియు వర్షం కారణంగా ఉంచరు మునిగిపోతే అక్కడ ప్రజల పరిస్థితి ఏమిటి అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇవన్నీ ఏమీ ఆలోచించకుండానే హెచ్ఎంటి అధికారులు పర్మిషన్ ఇచ్చారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే వెంచర్ పై చర్యలు తీసుకొని నిబంధనలను పాటించకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వర్షపు నీరు వెళ్లే విధంగా వెంచర్ నిర్మాణం జరగాలని లేని పక్షంలో వెంచర్ పై కట్టిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నేడు జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

## - ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గం కన్వీనర్ బండి మహేష్

విజేత, ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం వైష్ణవి గార్డెన్ లో నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణతో పాటుగా ప్రముఖులు హాజరు కానున్నారు. మలిదశ ఉద్యమ కాలంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రం, గుర్తింపు కార్డు ఇస్తూ, విద్యా, వైద్యంలో రాయితీలను కల్పించాలని సంకల్పంతో, ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం ఏర్పాటు చేయబడిన ఈ సమ్మేళనంలో పలు అంశాలపై చర్చ, అనంతరం గుర్తింపు పత్రాలను అందజేత, ఈ కార్యక్రమానికి రాజకీయ జేఏసీ, ఉద్యోగ జేఏసీ, న్యాయవాద, డాక్టర్, జర్నలిస్ట్ జేఏసీలు పాల్గొననున్నారు, దయచేసి ఈ కార్యక్రమానికి ఉద్యమకారులందరూ హాజరై విజయవంతం చేయగలరని ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గం కన్వీనర్ బండి మహేష్ తెలిపారు.



# పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి
- మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మహిళా వారోత్సవాలులో నూట్రిషన్ మిషన్ కార్యక్రమం.





విజేత, ఇబ్రహీంపట్నం : పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ఆవరణలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలులో నూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోషకాహార మేళలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్ లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుండి ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసి చాలా బాగున్నాయని తెలిపారు. అంగన్వాడీ ద్వారా గర్భిణులకు ఈ విధమైన పౌష్టికారాన్ని అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మార్చి 6వ తేదీ నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఇప్పటి వరకు ప్రతి వారం ఒక్కో థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇప్పటి వరకు నిర్వహించిన థీమ్ లను కింది స్థాయి నుండి పై అధికారి వరకు అందరూ సమర్థవంతంగా పని చేసి విజయవంతం చేయడం జరిగింది. అదే విధంగా నేటి నుండి ప్రారంభమయిన మహిళా వారోత్సవాలను కూడా అందరూ సమిష్టిగా పని చేసి విజయవంతం చేయాలని సూచించారు. మనం నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోగలుగుతామని అన్నారు. సేంద్రీయ పద్దతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. అంగన్ వాడి టీచర్లు గ్రామీణస్థాయి మహిళలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీ మహిళలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్థకమైన ఆహారాన్ని అందిస్తుంది. పోషకాహార మేళ ను ప్రజలకు, అధికారులకు ఒక అవగాహన కల్పించడం కోసం నిర్వహించడం జరిగిందని అన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ... మన శరీరం మనం ఉన్నంత వరకు ఉంటుంది. అందుచేత మనం మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా మనకు ఏవిధమైన వ్యాధులు దరి చేరకుండా ఉంటామని అన్నారు. మహిళా వారోత్సవాలలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్ధి దారులు, తల్లితండ్రుల చేత వంటలపోటీలు నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు న్యూట్రిషన్ ఫుడ్ పైన అవగాహన కలిగిస్తూ స్టాల్స్ నందు తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు మరియు పండ్లుకు సంబందించిన ఆహార పదార్ధాలను స్టాల్ లో ప్రదర్శనకు పెట్టడం జరిగింది. జంక్ ఫుడ్ యొక్క దుష్ప్రభావాలు, న్యూట్రిషన్ ఫుడ్ యొక్క లాభాలను వివరిస్తూ చాట్స్ ని ప్రదర్శించడం జరిగింది. హెల్త్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో గర్భిణి బాలింతలు, కిశోర బాలికలకు రక్త హీనత పరీక్షలు నిర్వహించడం జరిగినది. గర్భిణి బాలింతలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు, వంటల పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పిడి డిఆర్డిఓ/డిడబ్ల్యూఓ శ్రీలత, సిపిఓ సౌమ్య, జీ.ఎం. ఇండస్ట్రీస్ శ్రీలక్షి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, పిడి మెప్మా, సిడిపిఓ శాంతి కుమారి, 7 ప్రాజెక్టు ల సిడిపిఓ లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, డిడబ్ల్యూఓ సిబ్బంది పాల్గొన్నారు.

విజేత రంగారెడ్డి

రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి

# హైకోర్ట్ న్యాయవాది హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం

## - బార్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం విధులను బహిష్కరించి, నిరసన వ్యక్తం

విజేత, ఇబ్రహీంపట్నం : ఖాజా మొహిజుద్దిన్ హైకోర్ట్ న్యాయవాది శనివారం జరిగిన హత్యను తీవ్రంగా ఖండిస్తూ నిందితులను వెంటనే అదుపులోకి తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన నిందితులను శిక్షించాలని అదేవిధంగా ఆమోదించబడిన న్యాయవాద ప్రొటెక్షన్ యాక్ట్ త్వరగా అమలు చేయాలని బార్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో సోమవారం విధులను బహిష్కరించి తమ నిరసనను తెలియపరుస్తూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనాథ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ దాసరి శ్రీనివాస్ యాదవ్, సీనియర్ న్యాయవాదులు, ముద్దం వెంకటేశం, జెపి మహేందర్, గురువారెడ్డి, పాండు, జగన్, సుష్మ, శ్రీశైలం, మధు న్యాయవాదులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహేశ్వరంలో మహిళ అదృశ్యం



విజేత మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం. మహేశ్వరం గ్రామానికి చెందిన ఎరమోని శేఖర్ (34), జేసీబీ ఆపరేటర్, తన భార్య భాగ్యమ్మ (30) కనిపించడం లేదని మే 20న రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శేఖర్ తెలిపిన వివరాల మేరకు, 14 సంవత్సరాల క్రితం తలకొండపల్లి గ్రామానికి చెందిన భాగ్యమ్మను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మే 19న సాయంత్రం కుటుంబ సమస్యల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ సందర్భంగా భార్య మెడలో ఉన్న పుస్తెల తాడు తీసివేయడంతో, పుస్తెల తాడు తెచ్చుకుంటాననంటూ భాగ్యమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు. గతంలో కూడా గొడవల కారణంగా ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపాడు. అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5.6 అడుగులు, గోధుమ వర్ణం కలిగి ఉండి, నారింజ రంగు చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. రాఘవేందర్‌రావు తెలిపారు.

# భౌరంపేట్‌కు గర్వకారణంగా నిలిచిన ఐరన్ మ్యాన్ తులసిరెడ్డి

## - ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి స్వగ్రామానికి చేరుకున్న తులసిరెడ్డికి ఘన స్వాగతం



విజేత, దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ గ్రామానికి చెందిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గ్రామ ప్రజలు, నాయకులు, కుటుంబ సభ్యులు కలిసి తులసిరెడ్డికి ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తులసిరెడ్డిని శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. భౌరంపేట్ గ్రామానికి మాత్రమే కాకుండా మొత్తం ప్రాంతానికే తులసి రెడ్డి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. కఠోర శ్రమ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని యువతకు తులసిరెడ్డి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మిద్దెల యాదిరెడ్డి, పల్పునూరి పద్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి (చింటు), పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, పల్పునూరి బల్వంత్ రెడ్డి,గుర్రాల శ్రీకాంత్ రెడ్డి తదితర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

విజేత వరంగల్
వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగాం

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్..

విజేత, జయశంకర్ భూపాలాపల్లి : సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 40 దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ మొత్తం 40 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సమయపాలనతో కూడిన సేవలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించాలని, ఇందుకు సంబంధించి ఆయా శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అందిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి తప్పకుండా రశీదు అందజేయాలన్నారు. దీని ద్వారా సమస్యల పరిష్కారంలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా గుర్తించి, నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహించినా, కాలయాపన చేసినా అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా రెవెన్యూ అధికారి వసంత కుమారి, ఆర్డీవో హరికృష్ణ మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిసిరోడ్డుపనులనుప్రారంభించిన సర్పంచ్ కట్టుకూరి రాధిక శ్రీనివాస్



విజేత, గణపురం : గణపురం మండల కేంద్రంలో భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు ఆదేశాలతో గణపురం మండలం లోని పాత ఎంఆర్ఓ కార్యాలయం సిసి రోడ్డు పనులను మండలం రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకుసిసి రోడ్డును గణపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ కొబ్బరికాయ కోట్టి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్. మాజీకో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ చోటే మియా,మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, వార్డు మెంబర్ కొడెపాక అనిల్, మాజీ వార్డ్ మెంబర్ వేముల సుగుణ, మైనార్టీ మండల నాయకులు ఎస్ కే సైదు,ఎస్కే జానీ యువజన నాయకుడు దగడ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి దేవుళ్ళ అనుగ్రహం మొగుళ్ళపల్లి మండల ప్రజలపై ఉండాలి

## - కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము



విజేత, మొగళ్లపల్లి : ముక్కోటి హిందూ దేవుళ్ళ అనుగ్రహం మొగుళ్లపల్లి మండల ప్రజలపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము ఆ దేవుళ్లను వేడుకున్నారు. నడిగోటి రాము నేతృత్వంలో మొగుళ్లపల్లి గ్రామంలోని యువకులు ఆ ఏడుకొండలవాడి దర్శనంలో భాగంగా మంగాపురం తిరుపతిలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని, రామచంద్రపురం రాయల చెరువు ఒడ్డున పాతాళ అడుగులోని అష్టదశ శక్తి పీఠాలలో 5వ పీఠం అయినటువంటి పాతాళ శ్వేత వారాహి అమ్మవారి దేవాలయాన్ని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నడిగోటి రాము మాట్లాడారు. ఆ ముక్కోటి దేవుళ్ళ అనుగ్రహం మొగుళ్లపల్లి మండల ప్రజలపై ఉండాలని, కాంగ్రెస్ ప్రజాపాలనలో చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేద లబ్దిదారులకు చేరి, తెలంగాణ అభివృద్ధి పదంలో ముందుకు దూసుకెళ్లాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో..మొగుళ్లపల్లి మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అదేవిధంగా ఆ దేవుళ్ళ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, పాడి పంటలతో, పిల్లాపాపలతో, కుటుంబంతో కలిసి మెలిసి సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొగుళ్ళపల్లి రిపోర్టర్ వడ్లకొండ పవన్ గౌడ్, పుట్ట అజయ్, బత్తిని రాజు గౌడ్, సూర్నేని మణికర్, బూర ప్రకాష్ తదితరులున్నారు.

# గణపురం ఒకటవ అంగన్వాడీలో పోషణ మిషన్



విజేత, గణపురం : గణపురం మండలం తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గణపురం1వ అంగన్వాడి కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు గ్రామపంచాయతీలోని 6 అంగన్వాడి కేంద్రాలు సిబ్బంది, తల్లులు, పిల్లలు పోషణ మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ మిషన్ కార్యక్రమానికి తల్లులు,పిల్లలు,బాలింతలు,కిశోర బాలికలు పాల్గొనడం జరిగింది. పోషణ మిషన్ ముఖ్య ఉద్దేశం:గర్భిణీ కిషోర్ బాలికలు కు రక్తహీనత గురించి చెప్పడం, పోషకాహారం పై అవగాహన తెలియచేయడం,వంట పోటీలలో తల్లులు, భర్తలతో వంటలు చేయించి అందరికీ రుచి చూపించడం, ఇందులో భాగంగా పసునూటి శంకర్ వంట చేసి కార్యక్రమానికి వచ్చిన వారందరికీ రుచి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణపురం గ్రామపంచాయతీ కటుకూరి రాధిక శ్రీనివాస్ పాల్గొని ఆకుకూరలు, కూరగాయలు, బెల్లం పప్పులో ఉండే పోషకాలు గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా వార్డు మెంబర్ పసునూటి పసునూటి సౌమ్య శంకర్ పాల్గొని రక్తహీనత యొక్క ప్రాధాన్యతను తెలుపుతూ చిరుధాన్యాలు, మిల్లెట్స్ వాడటం పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆర్ సరోజన, పి ఇంద్ర, వి శ్రావణి, డి సుశీల, ఎన్ వెంకటరమణ, ఏ దేవకమ్మ, తల్లులు, పిల్లలు ,గర్భిణీలు, కిశోర బాలికలు పాల్గొనడం జరిగింది.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి




విజేత నల్లబెల్లి : మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐసీటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు మార్తా సుధ మాట్లాడుతూ, మండలంలోని గ్రామపంచాయతీలలో కార్మికులు 10 నుంచి 15 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ ఒప్పంద విధానంలోనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు మూడు నుంచి నాలుగు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. పని నిర్వహణకు అవసరమైన చీపుర్లు, పారలు, చేతి తొడుగులు, ముఖ రక్షణ కవచాలు, రబ్బరు బూట్లు వంటి రక్షణ సామగ్రిని ప్రభుత్వం అందించడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కార్మికులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండలో పనిచేస్తూ వడదెబ్బలకు గురవుతున్నారని అన్నారు. తాగునీరు, మజ్జిగ, ఉప్పు చక్కెర ద్రావణపు పొట్లాలు, విశ్రాంతి సమయం వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. విధి నిర్వహణలో ప్రమాదాలు జరిగినప్పుడు ఆదుకునే విధమైన భద్రతా వ్యవస్థ లేదని, కార్మికులకు కార్మిక భీమా సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికులను గుర్తించి గుర్తింపు పత్రాలు ఇవ్వాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామపంచాయతీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని, రక్షణ సామగ్రి అందించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా పని వేళలను మార్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దామా సాంబయ్య, మండల సహాయ కార్యదర్శి మార్తా నాగరాజు, కార్మికులు సుదర్శన్, ఐలయ్య, రవి, పద్మ, సూరమ్మ, రమేష్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసిన సర్పంచులు



విజేత నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన మేడిపల్లి రాజు బాపమ్మ మేడిపల్లి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ ఆదేశానుసారం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ముచ్చింపుల తండా సర్పంచ్ మచ్చిక రవీందర్ గౌడ్, నల్లబెల్లి సర్పంచ్ నాగేల్లి జ్యోతి ప్రకాష్, దస్తగిరిపల్లి సర్పంచ్ పులి రమేష్ గౌడ్, కన్నరావుపేట సర్పంచ్ పల్నాటి మూర్తి, నల్లబెల్లి గౌడ సంఘం అధ్యక్షుడు సట్ల రమేష్ గౌడ్, కొయ్యల వీరన్న, ముత్యాల కుమార్, సట్ల రామకృష్ణ, కామాగాని గంగాధర్, బీఆర్ఎస్ యువ నాయకులు మేడిపల్లి రాజుగౌడ్, కోటగిరి రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన అప్పయ్యపల్లి గ్రామ సర్పంచ్ఎలకపల్లి రమేష్



విజేత, గణపురం : గణపురం మండలం అప్పయ్య పల్లి గ్రామంలో కోడిశలకుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ ఎలకపల్లి రమేష్ సందర్శించి ఉపాధి పని ప్రదేశంలో ఉండవలసిన వసతులు తాగునీటి సౌకర్యం, నీడ సౌకర్యం,ప్రధమ చికిత్స పెట్టే సౌకర్యం, హాజరు పట్టిక ప్రతిరోజు సంతకాలు పెట్టాలని, కనీస వేతన డబ్బులు సరిగ్గా వేస్తున్నారని కూలీలను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఎండ తీవ్రంగా ఉండటంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రాజశ్రీ కాంగ్రెస్ పార్టీ శాఖా అధ్యక్షులు కొడారి రవీందర్ ,ఆశా వర్కర్ సంధ్య,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# వివో భవనానికి భూమి పూజ - ముఖ్య అతిథిగా సర్పంచ్ నరసింహారావు



విజేత, వెంకటాపురం, నూగురు : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని భోదాపురం గ్రామపంచాయతీలో సోమవారం బోదాపురం సర్పంచ్ కోర్స.నరసింహారావు ఆధ్వర్యంలో వివో భవనానికి భూమి పూజ చేసి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బోదాపురం గ్రామ సంఘం. మరియు సిసి. వెంకటలక్ష్మి . మరియు సోడి సావిత్రి. గ్రామ సంఘం అధ్యక్షులు. తెల్లం రాణి. గ్రామ పెద్దలు పోడెం సత్యం. కంతి. చందర్రావు. వార్డు మెంబర్స్. మరియు సంఘం సభ్యులు. గ్రామస్తులు పాల్గొన్నారు

విజేత
కరీంనగర్
కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల

# చొప్పదండిలో అనీమియా స్క్రీనింగ్ డ్రైవ్ ప్రారంభం

## - 100 శాతం గర్భిణులకు స్క్రీనింగ్ నిర్వహించాలని వైద్యాధికారుల ఆదేశం



విజేత,చొప్పదండి: కరీంనగర్ జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓఆదేశాల మేరకు, పీపీపీపీ రాష్ట్ర కార్యక్రమంలో భాగంగా చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనీమియా స్క్రీనింగ్ డ్రైవ్ ప్రారంభమైంది. మే 25 నుండి 30 వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని మెడికల్ ఆఫీసర్ తెలిపారు.సోమవారం చొప్పదండి వన్ సెంటర్ పరిధిలోని గర్భిణీ స్త్రీలకు అనీమియా స్క్రీనింగ్ నిర్వహించారు. అదేవిధంగా అన్ని సెంటర్లలో 100 శాతం గర్భిణీ స్త్రీలకు అనీమియా స్క్రీనింగ్ నిర్వహించాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తన, వైద్యాధికారి,డాక్టర్ సురేందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి,అంగన్‌వాడీ పర్యవేక్షకురాళ్లు సుధారాణి, నస్రత్, పర్యవేక్షకురాలు జి. శ్రీదేవి, పర్యవేక్షకుడు జాకీర్ హుస్సేన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు ఆలస్యం పై రైతు ఆత్మహత్యాయత్నం



విజేత కరీంనగర్ ప్రతినిధి : సుల్తానాబాద్ కేంద్రంలో ఆదివారం కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన రైతు మూల సంతోష్ రెడ్డి వడ్ల కొనుగోలు ఆలస్యంపై నిరసన వ్యక్తం చేశాడు ఐకెపి సెంటర్లో పట్లు పోసి నెలలు గడిచిన కొనుగోలు చేయకపోవడంతో లారీ పైకెక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆందోళనకు దిగాడు సమాచారం అందుకున్న అదనపు ఎస్సై అశోక్ రెడ్డి వెంటనే చేరుకొని రైతును నచ్చజెప్పి కిందికి దింపడంతో ప్రమాదం తప్పింది.

## అగ్ని ప్రమాదంలో రెండు ఆవులు సజీవ దహనం



విజేత కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని ముంజంపల్లి గ్రామంలో ఆదివారం ఎడ్ల శ్రీధర్ రెడ్డి వ్యవసాయ బావి వద్ద గడ్డి కట్టలు అంటుకొని పక్కనే ఉన్న గుడిసెలో ఉన్న మూడు ఆవులలో రెండు ఆవులు ఆవు దూడ అగ్నికి ఆహుతి అయ్యాయి ఒక ఆవు గాయాలతో బయటపడింది సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు కొందరిపై అనుమానం వ్యక్తం చేస్తూ రైతు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

## ఫోక్సో కేసులో పేరు వాడారని బండి సంజయ్ పరువు నష్టం దావా



విజేత కరీంనగర్ ప్రతినిధి : ఫోక్సో కేసులో తన పేరును ఉపయోగించి తన పరువుకు భంగం కలిగించారంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తెలుగు మీడియా సంస్థలు డిజిటల్ మీడియా యూట్యూబర్లు పలు పార్టీల హ్యాండిల్స్ నైటీ జనులకు పరువు నష్టం దావా నోకిటీసులు పంపారు దాదాపు 20050కి పైగా పేజీల్లో వందలాది మంది పేర్లను మీడియా సంస్థలను సోషల్ మీడియా హ్యాండిల్స్ ను చేర్చారు కాంగ్రెస్ టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కూడా ఇందులో ఉన్నారు గూగుల్ మెటా ఎక్స్ సంస్థలకు కూడా నోటీసులు జారీ అయ్యాయి అయితే ఇదే అంశంపై వార్తలు రాసిన నేషనల్ మీడియాను ఆయన వదిలేశారు.

## ధాన్యం కొనుగోలులో దోపిడీ ఆపాలి - బిజెపి



విజేత కరీంనగర్ ప్రతినిధి : శంకరపట్నం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తాలు తరువు బి గ్రేడ్ పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని వర్షాల నేపథ్యంలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తాసిల్దార్ సురేఖకు వినతి పత్రం సమర్పించారు ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వెంటనే కొనుగోలు పూర్తి చేయాలని లేనివాక్షంలో ఆందోళనలను చేపడతామని బిజెపి నాయకులు

## ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది - జీవన్ రెడ్డి



విజేత, కరీంనగర్ ప్రతినిధి : తెలంగాణ ధాన్యం కొలుగోలులో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందని ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందని టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి జీవన్ రెడ్డి ఆరోపించారు క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించకపోవడం తగదని రోజుల తరబడి రైతులు కేంద్రాల్లో పడిగాపులు కాస్తుంటే సివిల్ సప్లై మంత్రి గాలిలో చెక్కలు కొడుతున్నారని విమర్శించారు అందాల పోటీలు ఫుట్బాల్ పోటీలు నిర్వహించడానికి ప్రభుత్వానికి సమయం ఉంది కానీ ధాన్యం కొనుగోలు చేయడానికి సమయం లేదా అని ప్రశ్నించారు.

## తిరుపతికి మరో ప్రత్యేక రైలు ఉత్తర తెలంగాణకు ఊరట



విజేత కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ రైల్వే శాఖ జాల్నా రుపతి మధ్య 07814/15 నెంబర్ గల వేసవి ప్రత్యేక వారంతా ప్రాంతపు రైలును ప్రకటించింది ఈ రైలు జూన్ 12 19 26 తేదీల్లో ప్రతి శుక్రవారం సాయంత్రం 7:45కు తిరుపతి నుంచి నడుస్తుంది నిజాంబాద్ ఆర్మూర్ కోరుట్ల జగిత్యాల్ కరీంనగర్ పెద్దపల్లి జమ్మికుంట స్టేషన్లలో ఆగే ఈ రైలుతో ఉత్తర తెలంగాణ ప్రజలకు తిరుపతి యాత్రకు మరో సౌకర్యం లభించింది.

## రేణుక ఎల్లమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన సిరిసిల్ల రూరల్ సిఐ



విజేత ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ గ్రామం లోని కందివారి ఆడబిడ్డ రేణుక ఎల్లమ్మ మహా జాతర ఈ నెల 27, 28 తేదీలలో ఉండగా సోమవారం సిరిసిల్ల రూరల్ సి ఐ నాగేశ్వర్ రావు,స్థానిక ఎస్ ఐ అశోక్ తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ జాతరలో బండ్లు తిరిగే సందర్భంలో డ్రైవర్లు మద్యం సేవించి ట్రాక్టర్లు నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు, భక్తులందరూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడినచో వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ ఐ అశోక్,టెంపుల్ నిర్వాహకులు కంది రాజిరెడ్డి,కంది శ్రీనివాస్ రెడ్డి, కంది లింగ రెడ్డి,గుర్రం వెంకట్రామిరెడ్డి,గుర్రం లక్ష్మారెడ్డి, కంది బాల్ రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం - సిపిఎం




విజేత కరీంనగర్ ప్రతినిధి కరీంనగర్ నగరంలో వీధి కుక్కలు కోతుల బెడదను నివారించాలని రోజువారీగా మంచినీరు సరఫరా చేయాలని సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు ఆదివారం కోతి రాంపూర్ లో జరిగిన నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో డంపింగ్ యార్డ్ తరలింపు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు నూతన పాలకవర్గం ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## జమ్మికుంటలో గుర్తుతెలియని యాచకుడి మృతి



విజేత కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో కొండూరి కాంప్లెక్స్ అండర్ గ్రౌండ్ మార్గంలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని యాచకుడిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించా రు మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ సిబ్బందితో కలిసి ఆ యాచకుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు ప్రస్తుతం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## నా కొడుకు ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదు



విజేత కరీంనగర్ ప్రతినిధి : తిమ్మాపూర్ ఎల్ఎండి రిజర్వాయర్ పరిధిలో సదాశివ పల్లికి చెందిన జాతి శ్రీనిధి అనే యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు చేతులు కట్టేసి చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు కేఎన్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నా కొడుకు ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదు. ఎవరో ఏదో చేశారు అని కుటుంబ సభ్యులు కన్నీరుగా విలవిస్తున్నారు ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## ప్రజావాణిలో సమయపాలన పాటించని అధికారులు





విజేత, కరీంనగర్ : కరీంనగర్ కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కాకపోవడం పై విమర్శలు వస్తున్నాయి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజావాణికి నిర్ణీత సమయానికి రాకపోవడంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు అధికారులు సమయపాలన పాటించి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.




# సరస్వతి అంత్య పుష్కరాలకు సత్తుపల్లి నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు

- మే 30 రాత్రి 9 గంటలకు బయలుదేరు భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు
- రామప్ప, గణపేశ్వరాలయాల దర్శనానికీ అవకాశం
- డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ







విజేత, సత్తుపల్లి : కాళేశ్వరంలో జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం సత్తుపల్లి డిపో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటలకు సత్తుపల్లి నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు కాళేశ్వరం చేరుకుంటుందని తెలిపారు. పుష్కర స్నానాలు, ప్రత్యేక పూజలు నిర్వహించుకునేందుకు భక్తులకు తగిన సమయం కల్పించినట్లు పేర్కొన్నారు.పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లుపుష్కర స్నానం అనంతరం ఉదయం 7 గంటలకు కాళేశ్వరం నుంచి తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుందని, మార్గమధ్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన రామప్ప దేవాలయం, గణపేశ్వర ఆలయాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో భక్తులు ఒకే ప్రయాణంలో పుష్కర స్నానం, ఆలయ దర్శనాలు పూర్తి చేసుకునే వీలుంటుందని చెప్పారు.చార్జీలు ఇవే..రాను–పోను ప్రయాణ చార్జీ పెద్దలకు రూ.1,200, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ వెల్లడించారు. ఈ ప్రత్యేక బస్సులో రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకం కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు.మరిన్ని వివరాలకు...ప్రయాణానికి సంబంధించి మరిన్ని వివరాలు, సీట్ల రిజర్వేషన్ కోసం భక్తులు 9866619189, 9959225990, 9550767375 నంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.సరస్వతి అంత్య పుష్కరాల పుణ్యస్నానానికి వెళ్లాలనుకునే భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సత్తుపల్లిలో మండుతున్న భానుడి భగభగలు – ప్రజలు అప్రమత్తంగా ఉండాలి!

## - బీజేపీ నేత బానోత్ విజయ్





విజేత, సత్తుపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండగా సత్తుపల్లి ప్రాంతంలోనూ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. తీవ్ర ఎండలు, వడగాల్పుల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి టౌన్ అధ్యక్షుడు విజయ్ బానోత్ సూచించారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు రావద్దని ఆయన కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగడం వల్ల వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.ప్రజలు రోజంతా తగినంత నీరు తాగడంతో పాటు మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.అలసట, తలతిరగడం, అధిక చెమటలు పట్టడం, వాంతులు లేదా అస్వస్థత లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాల రక్షణకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపట్టాలని, తాగునీరు, చలివేంద్రాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలు రాజకీయాల కంటే ముఖ్యమని, మాటలు కాకుండా ప్రజల రక్షణ కోసం పాలకులు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షులు విజయ్ బానోత్ పేర్కొన్నారు.

# పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు మంత్రి తుమ్మల ఘన సన్మానం

- సత్తుపల్లి విజనరీ కోచింగ్ సెంటర్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు
- సత్తుపల్లి విద్యా చరిత్రలో అరుదైన ఘనత సాధించిన అర్ఫాజ్ అలీ



విజేత, సత్తుపల్లి : తెలంగాణ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్–2026)లో 120కి 120 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ ర్యాంక్ కైవసం చేసుకున్న సత్తుపల్లి విజనరీ కోచింగ్ సెంటర్ విద్యార్థి మహమ్మద్ అర్ఫాజ్ అలీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. గుండుగులపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం ద్వారా మహమ్మద్ అర్ఫాజ్ అలీ సత్తుపల్లి ప్రాంతానికి విశేష గుర్తింపు తీసుకువచ్చాడని కొనియాడారు. సాధారణంగా నగర ప్రాంతాల విద్యార్థులకే పరిమితమవుతాయని భావించే స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను గ్రామీణ ప్రాంత విద్యార్థి సాధించడం అభినందనీయమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన విజనరీ కోచింగ్ సెంటర్ యాజమాన్యం, అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు."విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే విద్యాసంస్థలే సమాజానికి ఆదర్శం. విజనరీ కోచింగ్ సెంటర్ విద్యా ప్రమాణాల్లో అగ్రస్థానంలో నిలుస్తూ సత్తుపల్లి ప్రాంతానికి గర్వకారణంగా మారింది" అని మంత్రి పేర్కొన్నారు.స్టేట్ టాపర్ మహమ్మద్ అర్ఫాజ్ అలీ మాట్లాడుతూ, తన విజయానికి విజనరీ కోచింగ్ సెంటర్ అందించిన నాణ్యమైన శిక్షణ, అధ్యాపకుల మార్గదర్శకత్వం ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి అంశాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధించడం వల్లే పూర్తి మార్కులు సాధించగలిగానని చెప్పారు. తన విజయానికి సహకరించిన అధ్యాపకులు, సంస్థ డైరెక్టర్లు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.విజనరీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు మాట్లాడుతూ, సత్తుపల్లి ప్రాంత చరిత్రలో తొలిసారిగా తమ సంస్థ విద్యార్థి రాష్ట్ర ప్రథమ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తూ మరిన్ని రాష్ట్ర స్థాయి విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లగుల్ల నరసింహారావు, కొత్తూరు ప్రభాకర్ రావు, విజనరీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు జొన్నలగడ్డ రాజు, కంచపోగు గోపాలరావు, ఖమ్మంపాటి రామకృష్ణ, సిబ్బంది షేక్ కరిముల్లా, విశ్వశాంతి స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు రాయితీలు — సామాన్యులపై భారాలు - సీపీఎం ఆగ్రహం



విజేత, సత్తుపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల పన్ను రాయితీలు, భూముల కేటాయింపులు, వివిధ రకాల సబ్సిడీలు అందజేస్తూ, మరోవైపు సామాన్య ప్రజలపై పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ ఛార్జీలు మరియు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల రూపంలో భారాలు మోపడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మొరంపొడి పాండురంగారావు విమర్శించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ కంపెనీల చేతుల్లో కేంద్రీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఒకవైపు నిరుద్యోగం, పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల రుణమాఫీలు చేయడం ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు రోజురోజుకు క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరల భారంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలను వెంటనే తగ్గించాలని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సామాన్యులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పేద మరియు మధ్యతరగతి వర్గాల కోసం ప్రత్యేక సంక్షేమ చర్యలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి కార్పొరేట్ల లాభాల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సీపీఎం హెచ్చరించింది. ప్రజల హక్కుల పరిరక్షణ, ధరల నియంత్రణ, ఉపాధి కల్పన వంటి అంశాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, నాయకులు రావుల రాజబాబు, చావా రమేష్, చప్పిడి భాస్కర్ పాల్గొన్నారు.

# గ్రామ సమైక్య భవనానికి సర్పంచ్ ఉమాదేవి శంకుస్థాపన

## - కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్



విజేత తల్లాడ : మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామపంచాయతీ నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గాంధీజీ గ్రామ సమైక్య భవనానికి గొల్లగూడ గ్రామ సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీర కృష్ణ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ కోడూరు ఉమాదేవి వీరకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అభ్యున్నత కోసం ఏర్పాటుచేసిన గాంధీజీ గ్రామ సమైక్య భవనం ఎంతోమంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామంలో ఉన్న పలు గ్రూపు మహిళా సభ్యులందరూ కూడా భవనాన్ని వినియోగించుకోవలసినదిగా ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాప సుధాకర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ, మహిళలను మరింత అభివృద్ధి పథంలో తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి బీసీ సెల్ అధ్యక్షులు కోడూరు వీర కృష్ణ, సెక్రెటరీ కవిత, సీసీ భద్రమ్మ, ఉపసర్పంచ్ తోటపల్లి నాగలక్ష్మి , వార్డు మెంబర్లు కోడూరు దుర్గారావు, నాయకులు కాపా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఇలా సాగరపు వెంకటేశ్వరరావు, ఇలా సాగరపు శ్రీనివాసరావు, కాప చిన్న రామారావు,కాపా మహేష్ బాబు, కాపా నరసింహారావు,ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ఇస్నేపల్లి అశోక్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇశ్నేపల్లి వీరయ్య, పగిడిపల్లి పెద్ద గోపయ్య, సాదా మల్లయ్య, బొగ్గుల పుల్లారెడ్డి,బొడ్డు కృష్ణ,గుండ్ల బాలకృష్ణ, కోడూరు సత్యం,తోటపల్లి కృష్ణ, గొల్లమందల అంజి, ఇశ్నేపల్లి దేవదానం, ఇశ్నేపల్లి తిరుపతిరావు, ఈవో అధ్యక్షులు ఇశ్నేపల్లి సుశీల, గొల్లమందల దేవకరణ, తదితరులు పాల్గొన్నారు.

# పింఛను లబ్ధిదారులందరూ ఆధార్ నిర్ధారణ చేసుకోవాలి : సర్పంచ్ కుంజా వినోద్



విజేత, ములకలపల్లి : ములకలపల్లి మండల జగన్నాధపురం రైతు వేదిక లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆధార్ ఫేస్ నిర్ధారణ కార్యక్రమం ను పరిశీలించిన జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్ అదేవిధంగా జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు కానున్న కొత్త పింఛను లకు దరఖాస్తుల స్వీకరణ ను పరిశీలించారు ఆయన మాట్లాడుతూ ఆధార్ ఫేస్ నిర్ధారణ గ్రామ పంచాయతీ లో సుమారు 50% పూర్తి అయిందని మిగిలిన పింఛను లబ్ధిదారులందరూ త్వరగా నిర్ధారణ చేసుకోవాలి అన్నారు అదేవిధంగా కొత్త పింఛను కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు కార్యక్రమంలో సెక్రటరీ ఇబ్రహీం కాంగ్రెస్ నాయకుడు సురభి రాజేష్ యన్ యస్ యు ఐ మండల అధ్యక్షుడు గుంట్రు సాయి సూపర్ వైజర్ సురేష్ లబ్ధిదారులు పాల్గొన్నారు

# అడవుల పరిరక్షణ - వాతావరణ సమతుల్యతకు ప్రభుత్వం ప్రాధాన్యత

- **జిల్లా కేంద్రంలో 32 లక్షల 23 వేల నిధులతో అటవీ శాఖ బీట్ ఆఫీసర్స్ వసతి**
- **కోటి 44 లక్షల రూపాయల CA - PD నిధులతో జిల్లా పరిరక్షణ అధికారి కార్యాలయాలను ప్రారంభించిన మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండ సురేఖ విజేత,**



విజేత, సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాలో సోమవారం రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండ సురేఖ పర్యటించారు. జిల్లా కేంద్రంలో 32 లక్షల 23 వేల రూపాయల కంపా నిధులతో నిర్మించిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్స్ వసతి గృహాలను ప్రారంభించారు.అనంతరం, ఒక కోటి 44 లక్షల రూపాయల CA – PD నిధులతో నిర్మించిన జిల్లా పరిరక్షణ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..సంగారెడ్డి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అడవుల పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా అర్బన్ ఎకో పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ లలో అర్బన్ ఎకో పార్కులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో అటవీశాఖ జిల్లా సంరక్షణ అధికారి కార్యాలయాన్ని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి సువర్ణ, PCCF ప్రియాంక వర్గీస్, TGIIC చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపాలిటీ చైర్పర్సన్ వనిత సంతోష్, సదాశివపేట చైర్ పర్సన్ అంజమ్మ సత్యానారాయణ, జిల్లా అటవీ శాఖ సంరక్షణ అధికారి ప్రసాద్ రెడ్డి, సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య, ఎఫ్ఆర్ఓ దేవీలాల్ , స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.







# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు
## - అడిషనల్ కలెక్టర్ సంగీత

విజేత, సంగారెడ్డి ప్రతినిధి
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 07, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా






అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

విజేత, పాపన్నపేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 25 సంవత్సరాల వయస్సు గల ఓ యువకుడు ఫ్రెంచ్‌కట్ గడ్డంతో, రెండు జతల బట్టలున్న బ్యాగుతో ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనం కోసం వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం చెక్‌డ్యాం వద్ద స్నానం చేయడానికి నీటిలోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగిపోయినట్లు స మాచారం. చెక్‌డ్యాం ఒడ్డున బట్టలు, బ్యాగు కనిపించడంతో అనుమానం చెందిన స్థానికులు వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గజఈతగాళ్ల సహాయంతో నీటిలో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఎలాంటి వివరా లు లభించలేదు.అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మృతుడి ఫోటో ఆధారంగా ఎవరైనా గుర్తిస్తే పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఫోన్ నెంబర్ 87126 57920, మెదక్ రూరల్ సీఐ జార్జ్ ఫోన్ నెంబర్ 87126 57916 లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



# రైతులు అధైర్య పడొద్దు. చివరి గింజ వరకు వడ్లను కొంటాము!

- **వడ్లనువేగంగా అన్లోడింగ్ చేయాలి!!**
- **మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్!!!**

విజేత,శివంపేట : వడ్లను అత్యంత వేగంగా ధాన్యం అన్లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం శివంపేట మండలం దొంతి గ్రామంలోని కామాక్షి బాయిల్డ్ రైస్ మిల్లు ను సివిల్ సప్లై అధికారులతో కలిసి అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ అత్యంత వేగంగా అన్లోడింగ్ ప్రక్రియ జరపాలన్నారు. హమాలీ, రవాణాను సమకూర్చుకొని వేగంగా జరపాలన్నారు.అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద, జగదీష్ తదితరులు ఉన్నారు.



విజేత మెదక్
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

# స్థలదాత అమరేందర్ రెడ్డికి పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రజలు సన్మానం.



విజేత , సంగారెడ్డి ప్రతినిధి స దాశివ పేట మండలంలోని ఆ త ్మకూర్ మాజీ సర్పంచ్ అ మ రేంద ర్ రెడ్డి గ్రామంలోని ప్రభుత్వాసుపత్రికి ఎకరా భూమి స్థలాన్ని దానం చేసిన సందర్భంగా ఆత్మకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ నిఖిత బింభదర్ చారి, మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మాజీ సర్పంచ్ అమరేందర్ రెడ్డి లాంటివారు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ మౌనిక రెడ్డి,ఇందూరి గంగన్న మాజీ సర్పంచ్, కల్పవూరి ప్రభు, ఏంపల్లి లక్ష్మయ్య, బోరంచ మహేష్,బేవరి యాదయ్య,మెట్టు బసవరాజ్ ,సయ్యద్ ఇసుఫ్,ఇందూరి రమేష్, గంధ వీరన్న ,మెట్టు ప్రభు,గంగాధర్ స్వామి, కుమ్మరి బసంతి, కొండాపురం రమేష్, కోర్మనీ సురేష్,పల్లె జగదీశ్వర్, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూ-వరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి



విజేత,పాపన్నపేట : పాపన్నపేట మండలం నాగసాని పల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శేఖయ్య సోదరుని కుమార్తె తొగిట భారతి వివాహం సందీప్ తో మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగింది. ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ యం పద్మా దేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పద్మ వెంట నాగసానిపల్లి మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఘనపురం శ్రీనివాస్ గౌడ్, సామెల్, భూపాల్, ప్రసాద్, కిషన్, రాజు, మల్లేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ షాక్ తో గృహిణి పార్వతి మృతి



విజేత,పాపన్నపేట : విద్యుత్ షాక్ కు గురై ఓ వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధి లోని ముద్దపూర్ గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. గ్రామస్థులు, కుటింబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దాపూర్ గ్రామానికి చెందిన పోలీసు పార్వతి (35) సోమవారం ఉదయం కూతురు సారీ పంక్షన్ ఉండడంతో బీరువాలో ఉన్న బట్టలు తీసుకునేందుకు వెళ్లగా ఆల్మరా పై ఉన్న విద్యుత్ తీగలను ఎలుకలు కొట్టడంతో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై అయి అరవడంతో కుటింబికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి వెంటనే మెదక్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. కుటింబికులు పాపన్న పేట పోలుసులకు సమాచారం అందివ్వడంతో పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతురాలి భర్త రవి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# విజేత నల్గొండ

నల్గొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి

## లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు



విజేత, తుర్కపల్లి : తుర్కపల్లి మండలం గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుట్ట సాయిలు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని ,ఉన్నతాధికారులు స్పందించి లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అక్రమ మట్టి లారీలను ఒక్కరోజు కేటాయిస్తే సెంటర్లో వడ్లను తగ్గించవచ్చని ఇట్టి సమస్యను అధికారులు త్వరగా స్పందించి పరిష్కరించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండబోయిన శ్రీశైలం దాసరి కొండల్, ఉడత రాజు, చిన్న రాజు చింటూ, లకావత్తు లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు

## ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గా ఉప్పు సాయికిరణ్ నియామకం



విజేత, తుర్కపల్లి : తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామానికి చెందిన ఉప్పు సాయికిరణ్ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్ గా అవకాశం ఇచ్చినటువంటి రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మరింత కృషి చేస్తానని అన్నారు. కార్యకర్త నమ్మకాన్ని, రాష్ట్ర శాఖ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



విజేత, వలిగొండ : వలిగొండ మండలంలోని సంగెం గ్రామానికి చెందిన పగిల్ల వెంకయ్య ఇటీవల మరణించడం జరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో అదే గ్రామానికి చెందిన నాయకులు సుర్కంటి మురళీధర్ రెడ్డి దయార్ద్ర హృదయంతో మృతుని కుటుంబ సభ్యులకు 5000 రూపాయలను గ్రామ సర్పంచ్ తాడూరి లలితా లింగస్వామి చేతుల మీదుగా ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాతరాజు నరసింహ బండ్యల శ్రీను, పగిళ్ల శ్రీను బాతరాజు శంకర్ గంగాపురం రవి బాతరాజు శివ శంకర్ జక్కల వెంకటేష్ బాతరాజు వెంకటేష్ భాను ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో పెట్టొద్దు

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



విజేత, యాదాద్రి భువనగిరి : వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే ప రిష్ కరించాల ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం రోజు కలెక్టరేట్ స మావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 85అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.అందులో రెవిన్యూ శాఖ 45, జిల్లా గ్రామీణాభివృది 12, సర్వే ల్యాండ్ 17,హౌసింగ్ 3,మున్సిపాలిటీ 4, జిల్లా గ్రామీణాభివృది,పంచాయతీ , యస్ సి కార్పొరేషన్, విద్యా, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక

- సిద్ధగురు రమణానంద మహర్షి
- "శత ప్రశ్న శరసంధానం" గ్రంథ ఆవిష్కరణ







విజేత, యాదాద్రి భువనగిరి : సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని సిద్ధగురు రమణానంద మహర్షి అన్నారు. షిర్డీ సాయిబాబాపై ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు చేస్తున్న వివిధ ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో సిద్ధగురు రమణానంద మహర్షి రచించిన "శత ప్రశ్న శరసంధానం" గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు.నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై వస్తున్న సందేహాలు, విమర్శలు, ఆరోపణలకు సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. "శత ప్రశ్న శరసంధానం" పేరుతో రూపొందించిన ఈ పుస్తకాన్ని సిద్ధగురు రమణానంద మహర్షి మొత్తం 11 భాషల్లో రచించగా భక్తుల్లో నెలకొన్న అనేక సందేహాలకు చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రామాణిక ఆధారాలతో సమగ్ర వివరణ ఇవ్వడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ షిర్డీ సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాయి మందిరాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయిబాబాపై అసత్య ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో సాయి బాబా ఐక్య వేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ,ప్రధాన కార్యదర్శి పీవీ ప్రసాద్,కోశాధికారి గుండా మల్లయ్య, మైనంపాటి ప్రసాద్, శ్రీ అనిల్ కుమార్, సాయి వాహిని, శ్యామ్, వీడియల సంజయ్ కుమార్,విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **8000 మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన**
- **వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్**
- **వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికార యంత్రాంగం**





విజేత, యాదాద్రి భువనగిరి : మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు.సోమవారం తెలంగాణ సచివాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 8,000 మహిళ భవనాల నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్యమంత్రి భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దనసరి అనసూయ సీతక్క, దుద్దిల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్షి , ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్, ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, మహిళా, శిశు అభివృద్ధి & సామాజిక సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్య, మహిళా & శిశు అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 8 వేల మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన చేయడం సంచలనాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు.ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఇప్పటి వరకు ఇందుకోసం రూ.10 వేల కోట్లకు పైగా ఆర్టీసీకి చెల్లించామని తెలిపారు.మహిళల ఉచిత ప్రయాణాన్ని అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నించినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదన్నారు. మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధి అనే సంకల్పంతో ఉచిత బస్సు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు.మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్‌లో 553 కొత్త బస్సులను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.ఇప్పటి వరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మహిళా సంఘాలకు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందన్నారు. మహిళలు తీసుకున్న ప్రతి రూపాయిని నిజాయితీగా తిరిగి చెల్లిస్తున్నారని కొనియాడారు.కొంతమంది మహిళలను చిన్నచూపు చూస్తున్నప్పటికీ, మహిళల శక్తిని ఎవరూ అంచనా వేయలేరని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని తెలిపారు.అనంతరం మహిళా సంఘాలకు అందించనున్న ఇందిరమ్మ చీరల డిజైన్లను ముఖ్యమంత్రి విడుదల చేశారు.ఈ వర్చువల్ సమావేశానికి... కలెక్టరెట్ నుండి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, అధికారులు,జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## నూతన మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

**- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్**



విజేత, దేవరకొండ : దేవరకొండ మండలంలోని వైదోనివంపు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గ్రామ అభివృద్ధికి గ్రామపంచాయతీ భవనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు ప్రజలకు అవసరమైన సేవలను సులభంగా అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడం వల్ల పారదర్శకత మరియు వేగం పెరుగుతాయని పేర్కొన్నారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారుగ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు అనంతరం నల్లగాసు సరిత ఎల్లయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, ఇంటి యాజమానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, అధికారులు,యువకులు పాల్గొన్నారు

# రోహిణి కార్తె వస్తే రోళ్లు పగులుతాయా..?



విజేత మామడ : జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, గ్రహాల రాజుగా పరిగణించే సూర్య భగవానుడు మే 25వ తేదీ సోమవారం నుండి రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించాడు. జూన్ 8వ తేదీ వరకు సూర్యుడు ఇదే నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ పక్షం రోజుల పాటు ఎండలు మునుపెన్నడూ లేని విధంగా భగభగమండనున్నాయి.వేసవి కాలంలో వచ్చే ఎండలు ఒక ఎత్తు అయితే, రోహిణి కార్తెలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు మరో ఎత్తు. ఈ సమయంలో సూర్యుడి కిరణాలు నేరుగా భూమిపై పడటం వల్ల ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుంది. అందుకే మండే ఎండల తీవ్రతను తెలపడానికి పెద్దలు "రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయి" అనే సామెతను వాడుకలోకి తెచ్చారు.సూర్యుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటే ఆ కాలానికి ఆ నక్షత్రం పేరుతో కార్తెగా పిలుస్తారు. ఏడాదికి మొత్తం 27 కార్తెలు ఉంటాయి.రోహిణి కార్తె ముగియగానే జూన్ 9 నుండి మృగశిర కార్తె ప్రారంభమవుతుంది. ఈ సమయంలోనే తొలకరి జల్లులు కురుస్తాయి.దీనిని బేస్ చేసుకుని రైతులు తమ పొలాల్లో 'ఏరువాక' పనులను ముమ్మరం చేస్తారు. రోహిణి కార్తెలో చేయకూడని పనులు ఇవే:ఈ పక్షం రోజుల పాటు సూర్యుడి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల పెద్దలు కొన్ని నియమాలను సూచించారు: శుభకార్యాలు వద్దు: రోహిణి కార్తె సమయంలో ఎలాంటి శుభకార్యాలు లేదా కొత్త పనులు ప్రారంభించకపోవడం మంచిది.ఆహార నియమాలు : శరీరంలో వేడి పెరగకుండా ఉండేందుకు మాంసాహారానికి దూరంగా ఉంటూ, సాత్విక ఆహారం, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.ప్రయాణాలు వాయిదా: ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడం ఉత్తమం. ముఖ్యంగా సుదూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి.ఈ కాలంలో సూర్యోదయం కంటే ముందే నిద్రలేచి సూర్య నమస్కారాలు చేయడం మరియు శక్తి మేరకు దానధర్మాలు చేయడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి..! - జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా





విజేత మామడ : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన తాజా పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి..




విజేత మామడ : గ్రామీణ పాల ఉత్పత్తిదారుల అభివృద్ధికోసం పాల కేంద్రాన్ని మండలంలోని పొన్కల్ గ్రామంలో సోమవారం రోజున కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ఈ డెయిరీ కేంద్రం ద్వారా స్థానిక పాల ఉత్పత్తిదారులకు మెరుగైన ధరలు,సమయానికి చెల్లింపులు మరియు సౌకర్యవంతమైన పాల సేకరణ సేవలు,నాణ్యమైన పాల పదార్థాలు అందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఇటువంటి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిర్వాహకులు రాజన్న మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామ రైతుల నుండి పాలను సేకరించి నాణ్యత ప్రమాణాల ప్రకారం పరిశీలించి డెయిరీకి పంపనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మి రాజారెడ్డి, జగిత్యాల మేనేజర్ లక్ష్మీపతి, సేల్స్ ఏజిఎం విష్ణు, సూపర్ వైజర్ రమేష్ ,వంశీకృష్ణ,చందు, గ్రామస్థులు ఉన్నారు

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా






విజేత నిర్మల్ జిల్లా ప్రతినిధి : జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాని పురస్కరించుకుని, కలెక్టరేట్ లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు.జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానిక అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజేత ఆదిలాబాద్
ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్

# దాహం తీరస్తున్న జనతా ఆటో యూనియన్ చలివేంద్రం




విజేత నిర్మల్ జిల్లా ప్రతినిధి : రోజురోజుకు భానుడి తీవ్రతతో ప్రజలు సతమతమవుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద జనత ఆటో యూనియన్ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఎండ తీవ్రత 46 డిగ్రీలు ఉన్న చల్లని తాగునీటిని ఆటో యూనియన్ సభ్యులు అందజేయడం ఎంతో అభినందనీయం. ఆటో యూనియన్ సభ్యులు రోజుకు సుమారు 40 డబ్బాలు (చల్లని) నీటిని అందించడంతో జిల్లా కేంద్రానికి ఆయా మండలాల నుండి ఇతర అవసరాలకు వచ్చే ప్రజలు దాహం తీర్చుకుంటున్నారు. సొంత డబ్బులతో తాగునీటిని అందించడం ఎంతో సంతోషంగా ఉందని జనత ఆటో యూనియన్ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాసిర్ ఖాన్, సయ్యద్ జావిద్, అర్షద్, సాదిక్ తోపాటు తదితరులున్నారు

# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడ ఇద్దరికి జైలు శిక్ష
## - 30 మందికి జరిమానా




విజేత నిజామాబాద్ ప్రతినిధి : మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందికి జరిమానా విధించగా, ఇద్దరికీ జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు.డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడ్డ 32 మందికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశానుసారం సోమవారం ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హైమద్ మొయిద్దిన్ వద్ద హాజరుపరచగా 30 మందికి రూ.3,00,000 జరిమనా విదించగా, ఇద్దరికి వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు

# అయ్యప్ప దేవాలయము లో 13 వార్షికోత్సవ వేడుకలు





విజేత, ఏర్గట్ల: మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో 13వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకంనిర్వహించారు. ఆలయ అర్చకులు రాకేష్ శర్మ ఆధ్వర్యంలో పూజ, అభిషేకం,హోమం, ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాత చంద్రశేఖర్ గౌడ్-సంతోష దంపతులు, రాంపూర్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఏర్గట్ల అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాత చంద్రశేఖర్ గౌడ్-సంతోష దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, మాల ధారణ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అయ్యప్ప సేవ సమితి సీనియర్ సభ్యులు మగ్గిడి వెంకటేష్ గౌడ్ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

విజేత
నిజామాబాద్
నిజామాబాద్, కామారెడ్డి

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు





విజేత, నిజామాబాద్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి శకటాలను ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గొలుసు దొంగ అరెస్టు




విజేత, నిజామాబాద్ ప్రతినిధి : ఒక ముసలావిడ మెడలో నుంచి చైన్ లాక్కొని పారిపోయిన ఆటో డ్రైవర్ ని 3 టౌన్ పోలీసులు పట్టుకున్నారు. మూడవ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 20 ఓ ముసలావిడ శుభ కార్యానికి వెళదామని నగరంలోని కెనాల్ కట్ట వద్ద ఆటో ఎక్కింది. నిజామాబాద్ నగర శివారులోని ఖానాపూర్ కు చెందిన ఆటో డ్రైవర్ విజయ్ ఆ వృద్ధురాలిని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి ఆమె మెడలోని సుమారు 2 తులాల బంగారు గుండ్ల పేరును, ఆమె వద్ద ఉన్న 200 రూపాయలను లాక్కొని పారిపోయాడు. దీంతో ఆ వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా 3 టౌన్ పోలీస్ వారు కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు. ఈ మేరకు సోమవారం నమ్మదగిన సమాచారం అందడంతో ఖానాపూర్ నివాసి అయిన విజయ్ ని పట్టుకున్నారు. అనంతరం విచారించగా అతను నేరం చేసినట్టు ఒప్పుకోవడంతో , అతని వద్ద నుంచి దొంగలించిన బంగారు చైన్ స్వాధీనం చేసుకుని నేరస్తున్ని రిమాండ్ కి పంపించారు.

# మైనారిటీ సెల్ జిల్లా నగర చైర్మన్ పదవులకు దరఖాస్తుల స్వీకరణ



విజేత, నిజామాబాద్ ప్రతినిధి : మైనారిటీ సెల్ జిల్లా అబ్జర్వర్ మొహమ్మెద్ మోయిన్ ఆధ్వర్యంలో మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్, నగర చైర్మన్ పదవుల కోసం ఆశావహుల నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోదరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారినే జిల్లా, నగర చైర్మన్ పదవులకు ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని, వాటిలో సమర్థులైన నాయకులను గుర్తించి బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విపుల్ గౌడ్, కార్పొరేటర్ మనోహర్, నయీమ్, ఒబేద్, నవాజ్, అసద్, హర్షద్, ఖయ్యూమ్, జాఫర్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

**అద్దె బస్సుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి.. పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి ..**






విజేత, నిజామాబాద్ ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాన్ని పురస్కరించుకుని మండల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం కేటాయించిన ఆర్టీసీ అద్దె బస్సులను వారికి అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ళను, రేషన్ కార్డులను కూడా మహిళల పేరిట మంజూరు చేస్తోందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల స్వల్ప కాలంలోనే కేవలం నిజామాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు.రూ. 1100 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. కేవలం మహిళలు అనే కాకుండా అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఎంతమాత్రం లేదన్నారు. ప్రజలు కూడా వాస్తవాలను గమనించాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ పిల్లల చక్కటి భవిష్యత్తు కోసం అన్ని వసతులు, నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ బడులలో చేర్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, తద్వారా అనవసర ఆర్థిక దుబారాను నివారించుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ప్రజలకు ఆరోగ్యాల పరిరక్షణకు దోహదపడే ఆహార ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే జిల్లాకు 18 అద్దె బస్సులను కేటాయించిందని తెలిపారు. అద్దె బస్సుల నిర్వహణను పక్కాగా పర్యవేక్షణ జరపాలని సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు నిజామాబాద్ జిల్లాలోనే అత్యధికంగా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరికొత్త ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే వ్యాపార పరంగా అద్భుత విజయాలు సాధించవచ్చని అన్నారు. నిజామాబాద్ నగరంలో కలెక్టరేట్ కు ఆనుకుని అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఏ సాయన్న, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, మండల మహిళా సమాఖ్యల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

- **రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**
- **మేలు రకం విత్తనాలను వినియోగించాలని రైతులకు పిలుపు**

విజేత, నిజామాబాద్ ప్రతినిధి : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మేలైన పంటలు సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఖరీఫ్ సీజన్ ను పురస్కరించుకుని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువులు, విత్తనాల పంపిణీపై చర్చించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తక్కువ నీటి వినియోగం అవసరం అయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. కేవలం వరి పంటకే పరిమితం కాకుండా జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. అధిక దిగుబడిని అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని, మేల్ సీడ్ ను వాడవద్దని సూచించారు. ఖరీఫ్ లో జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు. లారీలు, హమాలీల కొరత, ఎండ తీవ్రత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ రబీలో రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. దిగుబడులు ఆలస్యంగా వచ్చిన బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మినహాయిస్తే, జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తయ్యిందని అన్నారు. బాల్కొండ సెగ్మెంట్ లో సైతం ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు.




**యువత కోసం ప్రత్యేకంగా శిక్షణ తరగతులు**

యువత విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా జిల్లా కేంద్రంలోని న్యాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శిక్షణ తరగతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సాంకేతిక విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు న్యాక్ ద్వారా ప్లంబింగ్, హౌజ్ వైరింగ్, ఫిట్టర్, సెంట్రింగ్, మెసన్, యూనిఫాం స్టిచింగ్ వంటి కోర్సులలో శిక్షణ అందించేందుకు జిల్లా యంత్రాంగం ద్వారా త్వరలోనే ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువరిస్తారని అన్నారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 177 ఫిర్యాదులు



విజేత, నిజామాబాద్ ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 177 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి.భుజంగరావుతో పాటు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ బి.గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోహెడలో రైతుల ఆగ్రహ జ్వాలలు

- 118 ఎకరాల భూముల కోసం కోహెడ రైతుల ఉద్యమం.
- అధికారులను అడ్డుకున్న అన్నదాతలు.
- రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు.





విజేత, ఇబ్రహీంపట్నం : గ్రామంలోని సర్వే నెంబర్లు 582, 583, 584, 588, 589 పరిధిలో ఉన్న 118 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూముల కోసం తాము దాదాపు 40 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని, 118 మంది రైతు కుటుంబాల జీవనాధారం ఈ భూములేనని వారు పేర్కొన్నారు. ఫ్రూట్ మార్కెట్‌తో పాటు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం భూమిని కేటాయిస్తామని సమాచారం రావడంతో గ్రామానికి చేరుకున్న అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఆర్డీవో, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్‌లను నిలదీస్తూ తమ భూములను బలవంతంగా తీసుకోవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులకు రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భూమి కొలతల కోసం తీసుకువచ్చిన జేసీబీని ముందుకు వెళ్లనీయకుండా రైతులు నిరసన చేపట్టారు. ఓ వృద్ధురాలు జేసీబీ ముందు రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేయడం అక్కడి పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చింది. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా రైతులు తమ ఆందోళనను కొనసాగిస్తూ, "ప్రాణాలు పోయినా భూములు వదులుకోము" అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కోహెడ గ్రామంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. గ్రామంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

# మొగుళ్లపల్లి మండలంలో వడ దెబ్బతో ఇద్దరు మృతి





విజేత, మొగుళ్లపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం లోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన భోగి సాంబయ్య మే 21 గురువారం రోజున వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం భోగి సాంబయ్య ఉదయం రోజువారి కూలిగా పంట చేనులోకి వెళ్లి తిరిగి 11:30 సమయంలో ఇంటికి వచ్చాడు అప్పటికే అస్వస్థతకు గురైన సాంబయ్య చేతులు కాళ్లు వణుకుతూ ఇంటికి వచ్చి పడుకోగా వడగాల్పులకు గురైన అతను ఇంట్లో ఉన్న రేకుల షెడ్డు వేడి గాలికి మృతి చెందాడు. 12 సంవత్సరాల క్రితం మృతుడి భార్య చనిపోగా ఇప్పుడు సాంబయ్య మృతి కి ఇంటికి పెద్దదిక్కు లేకుండా పోయింది.మృతుడి కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కరిని కుటుంబం మాది అంటూ కుటుంబ సభ్యులు అన్నారు. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.పెద్దకోమటిపల్లి గ్రామంలో ముప్పు వొధమ్మ w/:రాజయ్య వడదెబ్బకు గురై చనిపోవడం జరిగింది దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి కుటుంబ సభ్యులు ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# గ్రామ సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం



విజేత,వెంకటాపూర్,(రామప్ప) : వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో ఆదర్శ గ్రామైక సంఘాల ఆధ్వర్యంలో నల్లగుంట గ్రామ మహిళ సంఘానికి భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా భూమి పూజ లో పాల్గొని కొబ్బరికాయలు కొట్టిన గ్రామ గ్రామైక సంఘం సభ్యులు,గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్,ఉప సర్పంచ్ మోరే లింగస్వామి,వార్డ్ మెంబర్ టి.శ్రీధర్,వివో సిసి భీమా నాయక్,గ్రామ పెద్దలు కొబ్బరికాయలు కొట్టి గ్రామ సంఘం భవన నిర్మాణ పూజ లో పాల్గొన్నారు. అనంతరం సిసి భీమా నాయక్ మాట్లాడుతూ నల్లగుంట గ్రామంలో మొత్తం రెండు వివో సంఘాలు ఉన్నాయి.ఇందులో మొదటి వివో కు మంతెన రమ,రెండో వివో కు బల్ల నాగరాణి లు వివో లు గా ఉన్నారు.గ్రామంలో మొత్తం 528 మంది సభ్యురాలు ఉన్నారు. మొదటి వివో భవన నిర్మాణ భూమి పూజ సోమవారం రోజున జరుపుకోవడం జరిగింది. అలాగే గ్రామంలో రెండో వివో కు కూడా స్థలము ఉంటే భవన నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు. వెంకటాపూర్ మండలంలో మొత్తం 32 గ్రామ సంఘాలకు సోమవారం రోజున భూమి పూజ చేయడం జరిగింది అలాగే గ్రామంలో స్థలం ఉంటే ఈజీఎస్ నిధుల ద్వారా గిడ్డంగి ఏర్పాటు చేసుకోవచ్చు అని తెలిపారు.అలాగే నల్లగుంట గ్రామంలో ఈజీఎస్ నిధుల ద్వారా 10 లక్షల రూపాయల నిధులతో మంజూరైన గ్రామ సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందనీ తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సమైక్య భవనం ద్వారా మహిళా సంఘాలు స్వయం సహాయక సంఘాలు గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ఒక కేంద్రంగా మారుతుందని, అలాగే భవన నిర్మాణం పూర్తయ్యాక గ్రామానికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్,ఉపసర్పంచ్ మోరె లింగస్వామి,వార్డ్ మెంబర్ టి.శ్రీధర్,గ్రామ సమాఖ్య సిసి భీమా నాయక్,వివో మంతెన రమ,అధ్యక్షులు పిన్ రెడ్డి సునీత, కార్యదర్శి స్వప్న, కోశాధికారి సుజాత, సహకారదర్శి లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు సావిత్రి,మహిళా సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం గ్రామంలో వివో బిల్డింగ్ ప్రారంభోత్సవం



విజేత. వెంకటాపురం. నూగురు : ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని అలుబాక గ్రామపంచాయతీ పరిధిలో ముత్తారం గ్రామంలో వివో బిల్డింగ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా అలుబాక గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి ఉప సర్పంచ్ గార లాలయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.. అలుబాక గ్రామపంచాయతీ సెక్రెటరీ సపక వినోద్ ఆలుబాక గ్రామ పంచాయతీ 1. వార్డు నెంబరు కోనే బాలమురళీకృష్ణ అలాగే ఎస్ ఆర్ కె. సుంకర కుమారి డి లావణ్య వో. ముత్తారం వివో గ్రూప్ మహిళలు అధ్యక్షులు మీడియం సమ్మక్క కాక ప్రవళిక గ్రామ పెద్దలు కుంజ సూరిబాబు సోడి గోపి సంద సూరిబాబు ముత్తారం వార్డ్ నెంబర్స్. సోడి జయమ్మ. తాటి సరోజిని గ్రామస్తులు మహిళలు పాల్గొని ప్రారంభించారు.

విజేత
మహబూబ్ నగర్
మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట

# గుడేబల్లూరులో పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన గ్రామ కార్మికులు





విజేత కృష్ణ : కృష్ణ మండలకేంద్రంలో గుడ్డెబల్లూరు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ పంచాయతీ కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. స్థానిక రోడ్డు పక్కన, గోడల వద్ద పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ శ్రమిస్తున్నారు ఖాకీ యూనిఫాంలో ఉన్న పురుష, మహిళా కార్మికులు పారలు, తట్టల సాయంతో చెత్తను సేకరించి శుభ్రం చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా గ్రామ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న వీరి సేవలు అభినందనీయం స్వచ్ఛ గ్రామం దిశగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోడ్లపై చెత్త లేకుండా చేయడం, మురికి కాలువల నిర్వహణ, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచడం వంటి పనులను కార్మికులు చేపడుతున్నారు గ్రామస్థులు కూడా పారిశుధ్య కార్మికులకు సహకరించాలని, చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని పంచాయతీ సిబ్బంది కోరుతున్నారు. పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామం అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు అని వారు తెలిపారు

# ఇందిరా మహిళ శక్తి గ్రామ సంఘ భవనాలకు శంకుస్థాపనలు





విజేత మహేశ్వరం : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా మహేశ్వరం మండలంలోని దుబ్బచర్ల, మహేశ్వరం గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి గ్రామ సంఘ భవనాలకు సోమవారం శంకుస్థాపనలు నిర్వహించారు. మహేశ్వరం గ్రామానికి నోడల్ అధికారిగా ఎంపీడీవో శారదమ్మ, దుబ్బచర్ల గ్రామానికి నోడల్ అధికారిగా ఏపీఎం సంతోష్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో రెండు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఏఈపీఆర్ రాంప్రసాద్, ఈసీ ఆదిత్య, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు యాదయ్య, సురేష్‌తో పాటు మహిళా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి



విజేత, జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాలో అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని వ్యవసాయ అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి అరటి తోట మిరప మక్కలు కాలిపోయిన రైతులకు ప్రభుత్వ అధికారులు అండగా నిలిచి సమగ్రమైన సర్వే నిర్వహించి ప్రభుత్వం దిష్టికి తీసుకపోవాలని అగ్ని ప్రమాదంలో చనిపోయిన రేపాక పల్లెదంపతులకు 20 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అగ్నిప్రమాదం నుంచి కాపాడాలని నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులను రైతుల ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బంధు క్రాంతి, సుజాత ఆత్మూరిశ్రీకాంత్ స్వాతి పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ రెడ్డయ్యకు నివాళులర్పించిన ఏక్సైజ్ ఎస్సై నారాయణ స్వామి



విజేత రామసముద్రం : మండలం ఏక్సైజ్ చెక్ పోస్ట్ లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఏక్సైజ్ కానిస్టేబుల్ రెడ్డయ్య కు ఆయన స్వగ్రామైన కలకడ మండలం పోతుల వారి పల్లిలో సోమవారం ఆయన పార్థీ వ దేహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించిన ఎక్సైజ్ ఎస్సై నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు అనంతరం రెడ్డయ్య భార్య అశ్విని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెడ్డయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయాలు అలుముకున్నాయి.

# శ్రీ పార్వతి సమేత శ్రీ చంద్రశేఖర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు



విజేత రామసముద్రం : మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ చంద్రశేఖర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలా స్వామి ఆధ్వర్యంలో అర్చకులు రవి స్వామి ఉదయం ఆలయ శుద్ధి చేసి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేసి పలు రకాల పుష్పాలతో స్వామి అలంకరణ చేసి మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకుని తమ మొక్కు బడులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాధాలు అందజేశారు. ఆలయం వద్ద తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి బదిరీ నారాయణ కుటుంబ సభ్యులు అన్న సంతర్పణ చేశారు స్వామి వారిని దర్శించుకున్న శోభ, సాఫ్ట్ వేర్ కుమార్ నాయుడు, పావని, రామ చంద్రారెడ్డి, సాయి, పట్టాభి, సౌమ్య తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

# తెలంగాణ ప్రభుత్వ విప్ ఐలయ్యకు స్వాగతం పలికిన ఉమ్మిడి



విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి : ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఏలేశ్వరంలో స్వగృహానికి విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలియ్య కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ పెళ్లిరోజు సందర్భంగా అన్నవరం శ్రీ సత్యనారాయణ మూర్తి దర్శనం నిమిత్తం రావడం జరిగిందని, ప్రతిపాడు నియోజకవర్గ ఇన్చార్జి ఉమ్మిడి వెంకట్రావును కలిసి అన్నవరం బయలుదేరడం జరుగుతుందన్నారు. అలాగే కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి వెంకట్రావు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు.అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విప్ ఇలియ్య పెళ్లిరోజు సందర్భంగా అన్నవరం సత్యదేవుని దర్శనానికి రావడం జరిగిందని,మా ఆతిథ్యాన్ని స్వీకరించి రాత్రి కి అన్నవరంలో బస చేసి ఉదయం దర్శనం అనంతరం తెలంగాణ బయలు దేరి వెళ్లడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో దొంతంశెట్టి చంద్రశేఖర్,వీర బాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి

## - ఐ.ఎఫ్.టీ.యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రామ్మోహన్ డిమాండ్



విజేత . బుట్టాయగూడెం. దేశంలో ఎన్ డి ఏ ప్రభుత్వం పెట్రోల్ , డీజిల్ వినియోగదారులపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపడాన్ని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టీ యు) జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రామ్మోహన్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎస్ రామ్మోహన్ మాట్లాడుతూ నేడు సామాన్య కుటుంబం నుండి పెట్రోల్ డీజిల్ వాడకం దారులు రేట్లు పెరగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని రామ్మోహన్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుడిపై ఆర్థిక భారాన్ని మోపి ఆనందిస్తున్నాయని రామ్మోహన్ మండి పడ్డారు. 110 రూపాయల నుండి 117 .19 వరకు పెంచారని అన్నారు. పెట్రోల్ డీజిల్ పెంపు సమయము కూడా కేవలం పది రోజుల కాలంలోనే నాలుగు సార్లు పెంచడం అంటే ఈ ప్రభుత్వాలు ప్రజలపై ఎంత భారాన్ని మోపడం కోసం ప్రయత్నిస్తున్నాయని , తక్కువ సమయం లోనే 120 రూపాయలు పెంచిన ఆశ్చర్యపడనవసరం లేదు అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజానీకం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవిస్తా ఉంటే ప్రభుత్వాలు మాత్రం కార్పొరేటు పెట్టుబడిదారులకు ఆర్థిక వ్యవస్థను మొత్తం కట్టబెట్టడం కోసం ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సామాన్యుడు కూడా నిరంతరం వాడుకుంటున్న పెట్రోల్ , డీజిల్ నేడు ఖరీదైన వస్తువుగా మారుస్తున్నారని అన్నారు. ఆయిల్ చమురు ఏజెన్సీ వ్యాపారస్తులకు లాభం చేకూర్చడం కోసం సామాన్య ప్రజల పై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్ , డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ బేరల్ రేట్లు ప్రకారం, ఇక్కడ పెట్రోల్ డీజిల్ ధరలు ఉండాలని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల వల్ల చమురు రేట్లు పెరిగితే రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా సరఫరా చేయాలి తప్ప, ఇక్కడ రేట్లు పెంచి అమలు చేయడం దుర్మార్గమైన చర్య అని రామ్మోహన్ అన్నారు. నేడు ప్రజల ఆర్థిక పరిస్థితి చాలా దీనస్థితిలో ఉందని ,ఇప్పటికే వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు , రైతు కూలీలు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక , అప్పులు తీరక నానా అవస్థలు పడుతున్నారని వ్యాఖ్యానించారు. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కూలీలు ఇతర ప్రజానీకం నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. పెంచిన పెట్రోల్ , డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని రామ్మోహన్ డిమాండ్ చేశారు.

# ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన - శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



విజేత . బుట్టాయగూడెం. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.తిరుపతి లోని తిమ్మనాయుడుపాలెంలో ఉన్న చైర్మన్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. యువ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తూ క్రీడా రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు క్రీడా శాఖ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.క్రీడా రంగ అభివృద్ధికి సేవలు కొనసాగాలని కోరారు .అనిమిని రవి నాయుడు నాయకత్వంలో రాష్ట్ర క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప్పటి. వెంకట్రావు, చిన్నబాబు, మూడే. కృష్ణ నాయక్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# "భావన ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్" ప్రారంభం

## - శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



విజేత చిలకలూరిపేట : పట్టణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పద్మశాలి సంఘ ముఖ్య నాయకులు అవ్వారు బసవయ్య ద్వితీయ కుమారుడు నాగరాజు నూతనంగా ఏర్పాటు చేసిన "భావన ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్"ను శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వ్యాపారం విజయవంతంగా సాగాలని, భగవంతుని ఆశీస్సులతో పదింతలు లాభాలు ఆర్జించి మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం వారి మరో సంస్థయైన "భావన లేడీస్ టైలర్స్ & కంప్యూటర్ – ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్స్"ను కూడా సందర్శించి యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో గేరా లింకన్, అవ్వారు పెద మస్తాన్, వెంకట్రావు, గ్రంది ఆంజనేయులు, జల్లెడ గణేష్, అందెల శౌరి, వూట్ల సాంబమూర్తి, షేక్ కరిముల్లా, దుర్గప్రసాద్, అవ్వారు నవీన్, నందం తిరుపళ్ళు, అవ్వారు వెంకటేష్, అవ్వారు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మెంటాడలో మెగా రక్తదాన శిబిరం మరియు ఉచిత కంటి వైద్య శిబిరం





విజేత మెంటాడ : మండల కేంద్రమైన మెంటాడలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన పాండ్రంకి శ్రీను మరియు అరసాడ సత్యవతి జ్ఞాపకార్థం మెంటాడ గద్ది చెట్టు వద్ద మెగా రక్తదాన శిబిరం మరియు విజయనగరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి ఆసుపత్రి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మెంటాడ గ్రామ యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరం లో సేవా దృక్పథంతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. రక్తదానమే ప్రాణదానమని శస్త్ర చికిత్సలు, ప్రసూతి సమయాల్లో చాలా అవసరమని రక్తదానం చేసి ఒకరి ప్రాణాలను నిలబెట్టడం పునర్జన్మ ఇచ్చినట్టేనని అన్నారు. అలాగే ఉచిత కంటి వైద్య శిబిరంలో డాక్టర్ ఆప్తమాలిక్, డాక్టర్ అనురాధ, భవాని ,సాయిలు మరియు వారి సిబ్బంది, క్యాంప్ కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు. 34 మందికికంటి పరీక్షలు చేయగా 13 మంది కంటి ఆపరేషన్కు సెలెక్ట్ అయ్యారు. ముగ్గురు కు కళ్ళ అద్దాలను పంపిణీ చేయగా 6 మంది కంటి ఆపరేషన్ కు వెళ్లారు. మిగిలిన వారికి ఉచిత మందులు అందజేశారు. అలాగే రక్తదానం చేసిన యువతను ప్రశంసించి సర్టిఫికెట్లు అందజేశారు. ఇలాంటి వైద్య శిబిరాలను మరెన్నో నిర్వహిస్తూ ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులను ప్రజలు కోరుతున్నారు.

Printed , published and owned by Dr.B.ANIL KUMAR ,@ 407 tharnaka, Hyderabad, Telangana state.Published at DAIWIK PUBLICATIONS Pvt.Ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , warangal dist.telangana state , Editor Dr.B.ANILKUMAR ,RNI TELTEL/2021/81079,cell : 7702866885 , vijethatelugudaily@gmail.com.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం లోపే నగరంలో
# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



విజేత, కరీంనగర్ : ఉద్యమాలకు ఖిల్లా అయిన కరీంనగర్ జిల్లాలో కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం దురదృష్టకరం గుంజ పడుగు హరి ప్రసాద్ అన్నారు ఉద్యమాలకు ఖిల్లా అయినా కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం సిగ్గుచేటని ఈరోజు తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ ఆద్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన టీ ఆర్ ఎస్ కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎర్పాటు చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. వచ్చే జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నైనా కరీంనగర్ నగరంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎర్పాటు చెయ్యాలని తెలంగాణ రక్షణ సేన ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. గతంలో తెలంగాణ ఉద్యమకారులు కరీంనగర్ నగరంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని జంక్షన్ అభివృద్ధి పేరుతో తొలగించిన నగరపాలక సంస్థ అధికారులు మళ్లీ ఆ విగ్రహాన్ని ఇప్పటి వరకు ప్రతిష్టించే ప్రయాణం చెయ్యలేదు. తొలగించిన విగ్రహం అసలు ఎక్కడుందో కూడ చెప్పడం లేదు. అ విగ్రహం ఉందో లేదో లేక దాన్ని అమ్ముకున్నారు అని కూడ వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటివరకు విగ్రహం ఎక్కడ ఉందో తెలుపకుండా నగర పాలక సంస్థ అధికారులు దాచిపెడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చి కూడ రెండున్నర సంవత్సరాలు కావస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడ కరీంనగర్ నగరంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యాలనే సోయి లేకుండా పోయింది. తెలంగాణ తల్లి విగ్రహం మన సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక అలాంటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని పునప్రతిష్ఠ చేస్తాలేరు అంటేనే ఈ పాలకులకు మన సంస్కృతి మీద ఎంతటి నిర్లక్ష్యం ఉందో అర్దం అవుతుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహం దగర ప్రతిజ్ఞ తీసుకొన్న తర్వాతనే మనం ఎన్నో ఉద్యమ కార్యక్రమాలలో మమేకమైమ పరిస్థితిని మనం చూసినాము. అంతటి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహం కరీంనగర్ జిల్లా కేంద్రంలో లేకపోవడం సిగ్గుచేటైన అయిన విషయం. నగరపాలక సంస్థ అధికారులు జంక్షన్ అభివృద్ధి పేరుతో తొలగించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఇప్పుడు వచ్చే జూన్ రెండవ తేదీన జరుపుకునే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల కంటే ముందే కరీంనగర్ నగరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ తో తెలంగాణ రక్షణ సేన ఆద్వర్యంలో ఈరోజు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడి చేసి నిరసన తెలిపారు భవిష్యత్తులో వారు కనక తెలంగాణ తల్లి విగ్రహాన్ని కరీంనగర్ నగరంలో ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని మరింతగా బలోపేతం చేసి ప్రభుత్వానికి కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల శక్తి ఎమిటో తెలియజేస్తామని టిఆర్ఎస్ పార్టీ కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, అదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, చంటి శ్రీనివాస్, బుడిగె పర్శారం గౌడ్, పిన్నింటి సంగీత రెడ్డి, జంగ అపర్ణ, కంతాల రోజారెడ్డి, కొలిపాక గౌతమి, కుసుంబా మంజుల, అసియా సుల్తానా, హుస్సేన్, గర్శకుర్తి విద్యాసాగర్, బానాల కుమారస్వామి, రజీ, బసవేణి రాజేందర్, పుసాల పవన్, రంగరవేణి అకాష్, మడిపెల్లి వినీత్, పూసాల రణధీర్, ఉంలేగుల నరేష్, సిపెల్లి వెంకటేష్, గువ్వ శ్రీనివాస్, ద్యావేర మహేష్, కొత్తపల్లి తిరుపతి, కొరిమి పద్మ, గాజుల నవ్య, కుతాడి రజిత, ఐలా ప్రసన్న, పల్లె శారద, గుంజపడుగు పవన్ కుమార్, ద్యావ శారద, గాజర్ల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు ఆర్టీసీ ఎంక్వయిరీ నంబర్లు విడుదల




విజేత కరీంనగర్ ప్రతినిధి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు ప్రధాన బస్ స్టేషన్ లో ఎంక్వైరీ నంబర్లను విడుదల చేశారు బస్సుల వేళలు సీట్లు చార్జీలు రూట్ ల వివరాల కోసం ప్రయాణికులు ఈ నంబర్లను సంప్రదించవచ్చు కరీంనగర్ బస్టాండ్ 99 59 22 5931, హుజురాబాద్ 7382 534960, జగిత్యాల 9493310269, కోరుట్ల 73 82534960, మెట్టుపల్లి 9010573250, గోదావరిఖని 9441335701, మంథని 7382825923, సిరిసిల్ల 7382312927, వేములవాడ 738285 1729, హుస్నాబాద్ 7382852772, ఈ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## మహిళా కార్మికురాలికి న్యాయం చేయాలని డిమాండ్




విజేత, కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సువార్త లక్షి అనే మహిళ కార్మికురాలిని తన నివాసంలో పని మనిషిగా నియమించుకుని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి ఇంట్లో పని చేయడానికి నిరాకరించిన లక్ష్మీపై కమిషనర్ దురుసుగా ప్రవర్తించి పరుష పదజాలంతో దూషించారని బాధితురాలు ఆరోపించారు ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మికులు కమిషనర్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు

## ఎమ్మెల్యే సత్యం సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన బి ఆర్ ఎస్ నేత



విజేత, కరీంనగర్ : బోయినపల్లి మండలం కోరం గ్రామ బి ఆర్ ఎస్ నేత ముడుపు మల్లారెడ్డి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్ లోకి వస్తున్నారని కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారు మల్లారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకత్వంలో కోరెం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్ యాదవ్ మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి నాయకులు అజయ్ పులి హనుమాన్లు పాల్గొన్నారు.

## చొప్పదండిలో 50% సబ్సిడీపై జీలుగా విత్తనాల పంపిణీ ప్రారంభం



విజేత,చొప్పదండి : చొప్పదండి మండలంలో ప్యాక్స్ చొప్పదండి,ఆర్నకొండ కేంద్రాల్లోరైతులకు 50% సబ్సిడీ కింద జీలుగా విత్తనాల పంపిణీని సోమవారంప్రారంభించారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి మమత,ప్యాక్స్ సీఈఓతిరుపతిరెడ్డి,కుమారస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారులు సంపత్, రమ్య జోష్న, రైతులు, సేల్ కౌంటర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఏఓ మమత మాట్లాడుతూ, వానాకాలం సీజన్‌కు రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ప్యాక్స్ ద్వారా అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందజేస్తామని తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతం

- గర్భిణులకు పోషకాహారం, పౌష్టికాహార కిట్ల పంపిణీ
- పోషకాహారంపై మహిళలకు అవగాహన



విజేత,చొప్పదండి : చొప్పదండిమండలంలోనిభూపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక శ్రీమంతం కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు.గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించి పండ్లు, గుడ్లు, పోషకాహార పదార్థాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై మహిళలకు అవగాహనకల్పించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంఅందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడిపెల్లి సంజీవ్ కుమార్, చొప్పదండి సర్కిల్ సూపర్వైజర్లు, సుధారాణి,మస్రత్ అంగన్‌వాడీ టీచర్లు జమున,కమలఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్థానికమహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చవద్దు
### - చొప్పదండి ఎస్ ఐ నరేష్ రెడ్డి

- అగ్ని ప్రమాదాలు కాలుష్యం నీవరించాలని రైతులకు విజ్ఞప్తి
- కొయ్యలను భూమి లోనే దున్నితే సేంద్రియ ఎరువు గా ఉపయోగం




విజేత,చొప్పదండి : చొప్పదండిమండలంలో ఇటీవలికాలంలో వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలిన గడ్డి,పంట అవశేషాలను రైతులుకాల్చడం వలనమండలంలోని పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చొప్పదండి మండల పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రత, గాలుల ప్రభావంతో మంటలు వేగంగా వ్యాపించి సమీప పంట పొలాలు, విద్యుత్ తీగలు, చెట్లు, గృహాలు మరియు ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమి సారవంతత కూడా తగ్గిపోతుందని పేర్కొన్నారు. నేపథ్యంలో రైతు సోదరులు పంట అవశేషాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగులబెట్టరాదని విజ్ఞప్తి చేశారు.

రైతులు పాటించవలసిన సూచనలు:

- పంట అవశేషాలను కాల్చకుండా పశువుల మేతగా లేదా సేంద్రీయ ఎరువుగా వినియోగించాలి.
- పొలాల్లో మంటలువేయాల్సిన పరిస్థితి వచ్చినా, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా చేయరాదు.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, రహదారుల సమీపంలో మంటలు వేయరాదు.
- ఎండ మరియు గాలిఎక్కువగా ఉన్న సమయాల్లో అగ్ని పెట్టడం పూర్తిగా నివారించాలి.
- చిన్న మంట కూడాపెద్ద అగ్ని ప్రమాదానికి దారితీయవచ్చని గుర్తుంచుకోవాలి.
- ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే అగ్నిమాపక శాఖ లేదా పోలీసులకు సమాచారం అందించాలి.

ప్రజల ప్రాణాలు, ఆస్తులు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, రైతులు సహకరించి అగ్ని ప్రమాదాలను నివారించాలని చొప్పదండి మండల పోలీసులు కోరారు.

## 30 ఏళ్ల సుదీర్ఘ సేవలు అమోఘం
### - హోంగార్డు నాముండ్ల సుందరయ్య కు సీపీ గౌస్ ఆలం ఘన వీడ్కోలు




విజేత, కరీంనగర్ : పోలీసు శాఖలో హోంగార్డుగా చేరి, మూడు దశాబ్దాలుగా నిస్వార్థంగా సేవలందించిన నాముండ్ల సుందరయ్య (హెచ్ జి 92) పదవీ విరమణ సందర్భంగా సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, సుందరయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, నైట్ డ్యూటీ కోర్టు వాచ్ విధులు నిర్వహించిన సుందరయ్య , 16-03-1996 న విధుల్లో చేరి తన 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఎంతో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో వారు అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సుందరయ్య శేష జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో సుందరయ్యకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తన సర్వీసు కాలంలో తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ, విధుల్లో క్రమశిక్షణ పాటించిన ఆయనను పలువురు అధికారులు అభినందించారు.ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఏసీపీ (ఏఆర్) ప్రతాప్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (హోంగార్డ్స్) శ్రీధర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవి మరియు కమిషనరేట్‌కు చెందిన ఇతర పోలీసు అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.

# లంబాడిపల్లెలో మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన




విజేత, చిగురుమామిడి : మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయమని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి తెలిపారు. ల ంబాడిప ల్లె గ్రామంలో 10లక్షల రూపాయలతో నిర్మించనున్న వివో సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి,ఉపసర్పంచ్ నక్క ఓదెలు యాదవ్,ఎంపీడీఓ విజయ్ కుమార్,ఎంపీవో కిరణ్ కుమార్,సీసి రవి కుమార్,వార్డు మెంబర్లు జీల స్రవంతి,ఆది శ్రీకాంత్,చందబోయిన శ్రీలత, మంద లక్ష్మణ్,ఫీల్డ్ అసిస్టెంట్ బండారుపల్లి రాజు,కారోబార్ చందబోయిన పరశురాములు,గ్రామస్తులు కాటం శ్రీనివాస్ రెడ్డి,నందికొండ మల్లారెడ్డి,బోట్ల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి బాటలు

## : వివో భావన నిర్మాణాన్ని ప్రారంభించిన సర్పంచ్ కుంజా వినోద్.



విజేత, ములకలపల్లి : ములకలపల్లి మండలం గ్రామంలో మంజూరైన స్వయం సహాయక సంఘాల భవనాలకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ కుంజా వినోద్ ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల కు ఇస్తున్నటువంటి సమస్యత స్థానాన్ని మహిళలు గుర్తించానన్నారు స్వయం సహాయక సంఘాలతో స్వయంగా ఆర్థిక అభివృద్ధి సాధించి సమాజంలో నిలబడాలని అనే ఉద్దేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓం సహాయం మంజూరు చేశారన్నారు జగన్నాధపురం గ్రామపంచాయతీ లో ఐదు భవనాలు అవసరం ఉందని మొదటి విడతలో భాగంగా మూడు భవనాలు మంజూరు అయ్యాయని తెలిపారు మొదటిగా రాజాపురం గ్రామంలో భవనానికి స్థలం ఇచ్చిన స్థలదాత సున్నం చినరాజు కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో సెక్రటరీ ఇబ్రహీం వివిఓ సీత వార్డు సభ్యులు బొగ్గం జ్యోతి కాంగ్రెస్ నాయకులు మిడియం నారాయణ సున్నం బుచ్చిబాబు సురభి రాజేష్ వేముల మురళి రామాచారి మరీదు నాగు కూరం రామకృష్ణ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు గుంటూరు సాయి శోభనాద్రి గ్రామ పెద్దలు సున్నం రాజులు మహిళలు పాల్గొన్నారు

# గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి





విజేత,వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ బీరెల్లి శంకర్ సోమవారం రోజున గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. శంకర్ ఆర్టీసీ కండక్టర్ గా విధి నిర్వహణలో ఉంటూనే, గ్రామంలో అందరితో ఎంతో కలుపుగోలుగా ఉండేవారు. సమాజ సేవలో ముందుండే ఆయన, ఊరిలో ఏ సామాజిక కార్యక్రమం జరిగిన అగ్రభాగాన నిలిచేవారని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన శంకర్ అకాల మరణం చెందడంతో లక్ష్మీదేవిపేట గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల తోటి ఉద్యోగులు మరియు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు గాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా చొప్పదండి నియోజకవర్గం

## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




విజేత,చొప్పదండి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు,టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసిన సందర్భంగా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గంగాధర మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల పేద,మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో తెలంగాణ మొదటి శాసనసభ సమావేశాల్లోనే డిగ్రీ కళాశాల కోరినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి డిగ్రీ కళాశాలను మంజూరు చేశారన్నారు.రాజకీయాలకతీతంగా చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామని, ఇందులోభాగంగాచొప్పదండిలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రామడుగులో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్,గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. మిగతా మండలాల్లో కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.గంగాధర మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి చొప్పదండి నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ తోట కరుణాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి,సువిన్ యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సత్తు కనుకయ్య, సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు

# అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి



విజేత :చిగురుమామిడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తోందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు.మహిళా,శిశు సంక్షేమ శాఖ కరీంనగర్ (రూరల్) ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభమైన 'మహిళా వారోత్సవాల' (మే 25 నుండి మే 30 వరకు) తొలిరోజు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ పరిధిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారత, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహార భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. నూతన భవనాల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్వ ప్రాథమిక విద్య అందుతుందన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ ఆరు రోజుల పాటు నిర్వహించే వివిధ అవగాహన కార్యక్రమాలను మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ అధికారిని శ్రీలత, పి ఆర్ ఏ ఈ నిరంజన్ రెడ్డి, ఉప సర్పంచ్ కాశవేని విజయ, విద్యా కమిటీ చైర్మన్ గొల్లపల్లి అరుణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టిమల్ల రవీందర్, మురహర్ రెడ్డి, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి ,దోమ శ్రీనివాస్ రెడ్డి, దోమ తిరుపతిరెడ్డి, వంగ కనకయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పన్యాల అనురాధ, ధనలక్ష్మి , ఇందిరా, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్లక్ష్యం..!

## - వడదెబ్బ తగిలినా దక్కని వైద్యం.. దారిలోనే వృద్ధుడి మృతి..

విజేత, ములకలపల్లి : ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైంది. తీవ్రమైన వడదెబ్బకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వస్తే.. అత్యవసర సమయంలో కాపాడాల్సిన డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఒక వృద్ధుడు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మండలంలో కలకలం రేపింది.

**అత్యవసర వేళ.. అంతులేని నిర్లక్ష్యం:**

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జగన్నాధపురం గ్రామానికి చెందిన ముత్తినీ నరసింహారావు (70) ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా తీవ్రమైన వడదెబ్బకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయనను స్థానిక మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కానీ, అక్కడ డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ సీట్లో లేరు. అత్యవసర సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో, అక్కడి సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి చేతులు దులుపుకున్నారు. పరిస్థితి మరింత దారుణంగా మారడంతో పాల్వంచకు, అక్కడి నుంచి కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు . అక్కడ కూడా లాభం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే నరసింహారావు ప్రాణాలు విడిచారు. సకాలంలో డాక్టర్ అందుబాటులో ఉండి ఉంటే ఆయన ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**శవాల దిబ్బలుగా మారుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు!**

గ్రామీణ ప్రాంతాల్లోని పి హెచ్ సి లు కేవలం పేరుకే నడుస్తున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యులు రాకపోవడం వల్లే ఇలాంటి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ల ఇష్టారాజ్యం : జీతాలు తీసుకుంటూ అత్యవసర సమయాల్లో విధులకు హాజరుకాకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.



మౌలిక వసతులు, పూర్తిస్థాయి వైద్యం అందకపోవడంతో గ్రామీణ ఆసుపత్రులు రెఫరల్ సెంటర్లుగా మారుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా, బాధ్యతారహితంగా వ్యవహరించిన సదరు డాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ఆసుపత్రుల పనితీరును మెరుగుపరచాలని స్థానికులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

# రైతులు అధైర్య పడొద్దు. చివరి గింజ వరకు వడ్లను కొంటాము!

## -వడ్లనువేగంగా అన్లోడింగ్ చేయాలి..!! మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్..!!

విజేత, శివంపేట : వడ్లను అత్యంత వేగంగా ధాన్యం అన్లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం శివంపేట మండలం దొంతి గ్రామంలోని కామాక్షి బాయిల్డ్ రైస్ మిల్లు ను సివిల్ సప్లై అధికారులతో కలిసి అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ అత్యంత వేగంగా అన్లోడింగ్ ప్రక్రియ జరపాలన్నారు. హమాలీ, రవాణాను సమకూర్చుకొని వేగంగా జరపాలన్నారు.అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద, జగదీష్ తదితరులు ఉన్నారు.



# ప్రజలు ఛీకొట్టినా నైజం మారలేదు

## - వైసిపి పై ఎమ్మెల్యే బొలిశెట్టి ఆగ్రహం



విజేత (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో : జగన్ అవినీతి,అరాచక పాలనతో రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రజలు గ్రహించి వైసిపిని 11 స్థానాలకు పరిమితం చేసి ఛీ కొట్టినా వైసిపి తప్పుడు నైజంమారటం లేదని శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విడిది కార్యాలయం లో సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.70 మంది లబ్ధిదారులకు రూ.36,46,237,00ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన 22 నెలలలో మొత్తం 972 మంది లబ్ధిదారులకు రూ.6,51,88, 474.00 లు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందించామని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకోవటమే ప్రధాన ఎజెండాగా వైసిపి నేతలు కూటమి ప్రభుత్వం పై విషప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలందరూ చంద్రబాబు పరిపాలన పై సంతోషం వ్యక్తంచేస్తుంటే జగన్ సహించలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధితో పాటు యువత కు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాల నే బృహత్తర లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని వారికి ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు. ప్రజలందరికీ సకాలంలో మెరుగైన,ఆధునిక వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, వైద్యం కోసం పేదలు అప్పుల పాలు కాకుండా ముఖ్యమంత్రి సహాయనిధిని పెద్దఎత్తున అందిస్తున్నామని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమం లో పైబోయిన వెంకటరామయ్య, ద్వారకాతిరుమల ఆలయ కమిటీ మెంబర్ కసిరెడ్డి మధులత, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు,వర్తనపల్లి కాశి, పెంటపాడు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పుల్ల బాబి, తాడేపల్లిగూడెం రూరల్ మండలం అధ్యక్షుడు అడపా ప్రసాద్, పాలూరి వెంకటేశ్వర రావు, చాపల రమేష్, సజ్జ సుబ్బు, వాడపల్లి సుబ్బరాజు, బొడ్డు సాయి, మద్దాల మణి కుమార్, గడ్డం నాని, నీలపాల దినేష్, పట్నాల రాంపండు, గుండుమోగుల సురేష్, పైబోయిన వైదేహి, నల్లగంచి రాంబాబు, చెరుకూరి సోమ శేఖర్, కొవ్వూరి లక్ష్మారెడ్డి, పీతల బుచ్చిబాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ బాజీ, పాటూరి సత్యనారాయణమూర్తి, శనగన రాంబాబు, పుట్టా రమేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

## - సీఐ వెంకటరామిరెడ్డి



విజేత,ప్యాపిలి : బక్రీద్ పండగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి కోరారు.సోమవారం పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలతో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్సై నాగార్జున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ నెల 28 న జరుపుకునే బక్రీద్ పండగను సామరస్యంగా జరుపుకోవాలన్నారు. పండగ రోజు రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఖాజీ, హాఫీజ్ మహబూబ్ ఖాన్,పట్టణ ముస్లిం మత పెద్దలు మస్తాన్ ఖాన్, బషీర్,నిజాం తదితరులు పాల్గొన్నారు.

# ఘన సన్మానం..



విజేత,జంగారెడ్డిగూడెం ప్రతినిధి : జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం కు చెందిన వనచర్ల లింగస్వామి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా బూత్ కమిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పంగిడిగూడెం గ్రామ ఎంపీటీసీ అడవి కొట్టు రవి ధనలక్ష్మి ఆధ్వర్యంలో లింగస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పడాల శీను, బిరుదు గడ్డల రాజు,బేతాళ సిద్ధి,గంజి వినోద్, కోమటికుంట హరీష్,అడవి కొట్టు సుబ్బారావు,కుంచె సుందర్రావు, కాకుల్లా సుబ్బారావు,గుండుగోలను పండు,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మచిలీపట్నం పార్లమెంట్ పరిసలకులు జెట్టి గురునాథరావుకి మర్యాదపూర్వంగా కృతజ్ఞతలు తెలిపారు.

# వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బాలాజీ చౌక్ సెంటర్లో మజ్జిగ పంపిణీ





విజేత, ప్రత్తిపాడు ప్రతినిధి : ఏలేశ్వరం పట్టణంలో బాలాజీ చౌక్ సెంటర్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వర రావు సూచనలతో సంస్థ సభ్యులు,కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పుట్టినరోజు సందర్భంగా దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కూటమి శ్రేణులు మీడియాతో మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే వివేకానంద సేవాసమితి సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈరోజు మజ్జిగ పంపిణీకి ఆర్థిక సాయం అందించిన దాతలు శ్రీనివాస ట్రేడింగ్ కు అధినేత అంబటి రామకృష్ణ,శ్రీదేవి, పని కృష్ణ ఎంటర్ప్రెజెస్ అధినేత దొరారెడ్డి, మిరాకిల్ మినిస్ట్రీస్ అధినేత ప్రవీణ్ పాల్ కు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గొల్లపూడి త్రిమూర్తులు, వాగు రాజేష్, అనంతరం రాజు, మామిడి లలిత, శ్రీను, రాతికింద సతీష్, జుత్తుల శ్రీను, బుగతా శ్రీను, వివేకానంద సేవా సమితి సభ్యులు అడపా శివప్రసాద్, పెంద్యాల రాజు, సునీల్, డేవిడ్, రాజబాబు, రాజశేఖర్, నాని తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రగతితోనే రాష్ట్రంలో వేగవంతమైన, సుస్థిరాభివృద్ధి

## - ప్రత్తిపాటి యడ్లపాడు స్పెసెస్ పార్క్, ఎం.ఎస్.ఎం.ఈ

### పార్కులను వేగంగా అభివృద్ధి చేస్తాం : ఎంపీ లావు

- ★ ఎం.ఎస్.ఎం.ఈ గ్రోత్ సమ్మిట్ –2026లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా వర్చువల్ గా జరిగిన యడ్లపాడు శ్రీ అగ్ని ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ శంకుస్థాపన.
- ★ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు.
- ★ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ లు రాష్ట్ర పారి–శ్రామికాభివృద్ధికి మూలస్తంభాల్లా నిలిచారు. : ప్రత్తిపాటి.
- ★ 2017లో ఈ పార్క్ ఏర్పాటుకు బీజం పడగా, తాను మంత్రిగా ఉన్నప్పుడే భూ కేటాయింపులు జరిపాం : ప్రత్తిపాటి.
- ★ అటవీశాఖ, కేంద్ర ప్రభుత్వ అనుమతులు జాప్యమే ఇంత ఆలస్యానికి కారణం : ప్రత్తిపాటి.
- ★ యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ లో ఉపాధి కల్పనలో స్థానిక యువతకే తొలిప్రాధాన్యత :ప్రత్తిపాటి.
- ★ యడ్లపాడు, స్పెసెస్, ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ల్ని వేగంగా అభివృద్ధి చేస్తాం : ఎంపీ లావు.
- ★ విశాలమైన, సౌకర్యవంతమైన రోడ్డు మార్గమే ఈ ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తుంది : లావు
- ★ ప్రతి మండలంలో 4, 5 పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు కానున్నాయి : లావు
- ★ వాటి నిర్వహణ బాధ్యతలు స్వయం సహాయ సంఘాలకే అప్పగిస్తాం : లావు



విజేత ఎడ్లపాడు :
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎం.ఎస్.ఎం.ఈ పార్కుల ఏర్పాటులో నియోజకవర్గంలోనే తొలి ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ యడ్లపాడులో అందుబాటులోకి రావడం ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు వరమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వర్చువల్ గా నిర్వహింపబడిన యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయవాడ డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కళా వేదికలో జరిగిన ఎం.ఎస్.ఎం.ఈ గ్రోత్ సమ్మిట్–2026లో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడినుంచే నేరుగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుకానున్న పలు ఎం.ఎస్.ఎం.ఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. సీఎం ప్రసంగం అనంతరం ఎమ్మెల్యే, ఎంపీలు కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు.

**చంద్రబాబు, లోకేశ్ లే మూల స్తంభాలు..**

రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ లు కీలకంగా వ్యవహరిస్తున్నారని, ఏపీ పారిశ్రామిక ప్రగతికి వారిరువురూ మూలస్తంభాల్లా నిలిచారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతితోనే రాష్ట్రం వేగవంతమైన. సుస్థిర అభివృద్ధి సాధిస్తుందన్నారు. గత పాలకులు తమ స్వార్థ ప్రయోజనాలకోసం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిని పతనావస్థకు చేర్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రాష్ట పారిశ్రామిక రంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. నూతన ఆలోచనలు..వేగవంతమైన అనుమతులు.. సరళతర పాలసీలతో పెట్టుబడిదారుల్ని విశేషంగా ఆకర్షించేలా ఏపీ ఇండస్ట్రియల్ పాలసీలను రూపొందించారన్నారు. నియోజకవర్గానికో ఎం.ఎస్.ఎం.ఈ పార్క్, ఇంటికో పారిశ్రామిక వేత్త లక్ష్యసాధనలో ముఖ్యమంత్రి నేడు తొలి విజయం సాధించారని ప్రత్తిపాటి ప్రశంసించారు.

**ఉపాధి కల్పనలో స్థానిక యువతకే తొలి ప్రాధాన్యత...**

కొత్తగా ఏర్పాటు కానున్న యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్కు ద్వారా లభించే ఉపాధిలో స్థానిక యువతకే తొలిప ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అధికారుల్ని కోరారు. పార్క్ లో ఏర్పాటయ్యే పరిశ్రమల యాజమాన్యాలకు ఈ విషయం స్పష్టంగా తెలియచేయాలన్నారు. 2017లోనే ఈ పార్క్ ఏర్పాటుకు బీజం పడిందన్న ప్రత్తిపాటి. తాను మంత్రిగా ఉన్నప్పుడే భూ కేటాయింపులు పూర్తయ్యాయన్నారు. అటవీశాఖ, కేంద్ర ప్రభుత్వ అనుమతులు, క్లియరెన్సుల్లో జరిగిన జాప్యంతో పార్క్ ఏర్పాటుకు ఇంత సమయం పట్టిందన్నారు. యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ లో స్పేస్, డిఫెన్స్, ఫుడ్, ఆయుర్వేద విభాగాలకు చెందిన యూనిట్ల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత ఉపాధికోసం ఎదురు చూడకుండా, తమలాంటి వారికే ఉపాధి కల్పించే ఆలోచన చేయాలని, ఈ తరహా పార్కుల్లో ప్రత్యేక యూనిట్ల ఏర్పాటుపై ఆలోచన చేయాలని ప్రత్తిపాటి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు, బ్యాంకుల రుణాలతో మంచి పట్టుదల కలిగిన యువత తమ కలలను, లక్ష్యాలను సాకారం చేసుకోవచ్చన్నారు.

**విద్యాభ్యాసం ఒకెత్తు అయితే.. ఉద్యోగాలు పొందడం మరో ఎత్తు : ఎంపీ లావు**

తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివించడానికి ఎంత కష్టపడతారో... వారికి సరైన ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం.. నాయకులు అంతే కష్టపడతారని, విద్యాభ్యాసం పూర్తిచేయడం ఒకెత్తు అయితే, ఉద్యోగాలు పొందడం మరో ఎత్తని నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అభిప్రాయపడ్డారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, అది జరగాలంటే పరిశ్రమలు రావాలని, సరైన మౌలిక వసతులు, మంచి అనుకూల వాతావరణం ఉంటేనే ఇండస్ట్రీలు వస్తాయన్నారు. యడ్లపాడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ లాంటివి నియోజకవర్గానికొకటి చొప్పున ఏర్పాటు కానున్నాయన్నారు. చిలకలూరిపేటలో ప్రధానంగా ఉన్న ఇండస్ట్రీ టెక్స్ టైల్స్ విభాగమని, జిన్నింగ్..స్పిన్నింగ్ విభాగాల ద్వారా దాదాపు రూ.5వేల కోట్ల వ్యాపారం జరుగుతోందన్నారు. దాదాపు 35 వేల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. ఈ వ్యాపారం ఒక్కటే సరిపోదనే యడ్లపాడులో గతంలో స్పెసెస్ పార్క్, ఇప్పుడు ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మంచి విశాలమైన, సౌకర్యవంతమైర రోడ్లు ఉండటం, ఈ పారిశ్రామిక పార్కుల వేగవంతమైన అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

**ప్రతి మండలంలో 4, 5 ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు..**

ఇటీవలే యడ్లపాడు మండలంలో మునగ క్లస్టర్ ఏర్పాటు చేశామని, అదే విధంగా రైతుల ఉత్పత్తులకు అనువైన 4, 5 ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ప్రతి మండలంలో ఏర్పాటు చేయబోతున్నట్లు ఎంపీ చెప్పారు. చిలకలూరిపేట పట్టణంలో కార్పెంటర్ క్లస్టర్ ఒకటి ఏర్పాటు చేయాలని కోరారని, దానిపై కూడా దృష్టి పెట్టినట్లు లావు తెలిపారు. ఈ క్లస్టర్ల నిర్వహణ బాధ్యతల్ని స్వయం సహాయ సంఘాల సభ్యులకే అప్పగిస్తామని స్పష్టంచేశారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు ఈ పార్కుల్లో తమ యూనిట్లు ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శ్రీ అగ్ని ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ప్రమోటర్ డా. ఏ.బి.యస్. శాస్త్రి, ఆర్డీవో బాలకృష్ణ, జిల్లా ఎం.ఎస్.ఎం.ఈ మేనేజర్ సురేష్, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, కాకతీయ సేవ సమితి అధ్యక్షులు కుర్రా రత్తయ్య, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, సొసైటీ చైర్మన్ మద్దినేని సుబ్బారావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, ముద్దన నాగేశ్వరరావు, శిలార్, భాస్కర్, ఎమ్మార్వో , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత..

## - ప్రజల నుంచి వినతులు స్వీకరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



విజేత, గుంటూరు ప్రతినిధి : పోలీస్ పి జి ఆర్ ఎస్ లో ప్రజలు అందజేసిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 148 వినతులను స్వీకరించి, ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలించారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, వారి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు అత్యుత్తమ సంతృప్తి కలిగే విధంగా ఉత్తమమైన పోలీస్ సేవలు అందించడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీస్ శాఖకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి , మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి , ట్రాఫిక్ డిఎస్పీ బెల్లం శ్రీనివాస్, సౌత్ డిఎస్పీ మధుసూదన్ రావు,డిఎస్పీ , పి జి ఆర్ ఎస్ సీఐ బిలాలుద్దీన్ పాల్గొన్నారు.

# ఏలూరు పోలీస్ పిజిఆర్ఎస్ లో 53 ఫిర్యాదులు



విజేత,ఏలూరు ప్రతినిధి : ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ లో పబ్లిక్ గ్రీవెన్స్ ను ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ సోమవారం నిర్వహించారు. ప్రజల సమస్యలను త్వరి తగతిన, పారదర్శకంగా పరిష్క రించడమే లక్ష్యంగా పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కార వేదిక' కార్య క్రమం లో జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏ ఆర్ అదనపు ఎస్పీ జి ముని రాజా తో కలిసి ఫిర్యాదు దారుల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమం పూర్తిగా పేపర్ లెస్ పద్ధతి లో, పారదర్శ కమైన ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువతకి మెడికల్ సీట్ ఇప్పిస్తానని మోసం చేసిన విషయాలపై దెందులూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేసిన నేపథ్యంలో ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీ ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలను తెలిపారు. పి జి ఆర్ ఎస్ లో మొత్తం 53 ఫిర్యాదులు అందాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు మరియు ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. ఎస్పీ స్వయంగా ఫిర్యాదు దారులతో మాట్లాడి, వారి సమస్యలను విన్నారు. ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణమే విచారణ చేపట్టి, నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు తమ సమస్యల కోసం జిల్లా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా మరిన్ని వెసులుబాటులను ఎస్పీ వివరించారు.డబ్బు, సమయం వృథా చేసుకోకుండా నేరుగా సమీపంలోని సబ్-డివిజన్ లేదా సర్కిల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు అని ఎస్పీ సూచించారు. ఫిర్యాదులు చేయాలనుకునే వారు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చు అన్నారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల స్థితిగతు లను తెలుసు కోవడానికి 1100 టోల్-ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చు అని ఎస్పీ తెలిపారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు భేష్.. - డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



విజేత, రాజమహేంద్రవరం ప్రతినిధి: నగరంలో నిరంతర నిఘా, పారిశుధ్య చర్యలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సోమవారం పరిశీలించారు.తెల్లవారుజాము నుంచి సీసీ కెమెరాలు, సాంకేతికత సాయంతో నగరంలోని వీధుల్లో జీవీపీల తొలగింపు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం మరియు పారిశుధ్య కార్మికుల పనితీరును సమర్థవంతంగా ఏ విధంగా పర్యవేక్షిస్తున్నదీ ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా డిప్యూటీ సీఎంకు వివరించారు. అలాగే సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేయడం ద్వారా నగరంలోని ప్రతి కదలికను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.పంచాయతీ రాజ్ శాఖలో కూడా ఇటువంటి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఇంచార్జి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలు దేశం మొత్తం మాట్లాడుకునేలా..





విజేత, రాజమహేంద్రవరం ప్రతినిధి : దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి మాట్లాడుకునేలా గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా ఆయన సోమవారం స్థానిక ఆర్ ఎమ్ సి కార్యాలయ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం లో పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, రానున్న ఏడాది కాలంలో గోదావరి పుష్కరాల పనులను అత్యంత సమర్థవంతంగా చేపట్టాలని, ప్రత్యేకించి ఉభయగోదావరి జిల్లాల అధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.పరిశ్రమల తరపున ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు స్థానిక గ్రామ పంచాయతీలు నిధులు కోరినప్పుడు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్ ) కింద వచ్చే నిధులను ప్రత్యేకంగా పుష్కరాల నిర్వహణకు వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ నిధుల ద్వారా పుష్కరాల ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనం, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టే విధంగా పరిశ్రమలు సహకరించాలని కోరారు.సీఎస్ఆర్ నిధులను విస్తృతంగా వినియోగిస్తూ ప్రజలను భాగస్వాములుగా మార్చి, చైతన్యపరుస్తూ కాలుష్యాన్ని అరికట్టాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పరిశ్రమల తాలూకు కష్టనష్టాలు తెలిసినవాడిని. పరిశ్రమల క్షోభ తెలిసినవాడిగా మీకు వెన్నంటి ఉంటాను. పూర్తి సహకారం అందిస్తాను" అని ఉప ముఖ్యమంత్రి పరిశ్రమల ప్రతినిధులకు భరోసా ఇచ్చారు.అదే సమయంలో ప్రస్తుతం 15 మిల్లీగ్రామ్ ఫర్ యూనిట్ స్థాయిలో కాలుష్యం నమోదవుతోందని తెలిసిందని పేర్కొంటూ, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశ్రమలు నడపాలని సూచించారు. పరిశ్రమల ప్రతినిధులు కోరిన సమస్యలకు తప్పకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇస్తూనే, పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ, ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా శ్రద్ధ చూపించారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు స్థానిక అవసరాలను బట్టి పరిశ్రమల సహకారాన్ని తీసుకుంటామని, దీనిపై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా చర్చిస్తామని వెల్లడించారు.ఉప ముఖ్యమంత్రి పిలుపునకు పరిశ్రమల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. తాము ఖచ్చితంగా కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నామని, నిబంధనల మేరకే తమ పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. దీనికి సంబంధించిన ధృవపత్రాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అందజేస్తామని తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంటూ, సీఎస్ఆర్ కార్యకలాపాల కింద ఇప్పటికే పలు సందర్భాల్లో నిధులు అందిస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాల పనుల్లో స్థానిక కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి పనిచేసే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆశయాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావు, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమండ్రి నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విజ్జేశ్వరంలో డిప్యూటీ సీఎం పవన్ క్షేత్రస్థాయి పర్యటన..



విజేత, నిడదవోలు ప్రతినిధి : రాజమహేంద్రవరం పర్యటన ముగిసిన అనంతరం, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం నిడదవోలు నియోజకవర్గంలోని విజ్జేశ్వరంలో పర్యటించారు. రాబోయే ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాలు – 2027 ముందస్తు ఏర్పాట్లు మరియు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఒక కీలక ప్రతిపాదనను మంత్రి కందుల దుర్గేష్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జలవనరుల శాఖకు సంబంధించిన విజ్జేశ్వరం నుండి సిద్ధాంతం మధ్య ఉన్న 'వశిష్ఠ రైట్ ఫ్లడ్ బ్యాంక్ కెనాల్' మీదుగా బీటీ రోడ్డు (ఏటిగట్టు) నిర్మించాలనే ప్రతిపాదనను పరిశీలించాల్సిందిగా మంత్రి కందుల దుర్గేష్ ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎం, స్థానిక గోదావరి బండ్ తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. స్థానికంగా ఉన్న గోదావరి బండ్‌ను పర్యాటకంగా, రవాణా పరంగా డెవలప్ చేస్తే ఉభయ గోదావరి జిల్లాల అనుసంధానానికి సైతం ఎంతో మేలు జరుగుతుందన్న మంత్రి దుర్గేష్ వివరణపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. పుష్కరాల నాటికి ఈ రోడ్డు నిర్మాణాన్ని ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు. పర్యటనలో స్థానిక ఇరిగేషన్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా పెండ్యాల, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో ఏటిగట్టు పటిష్టపరిచేందుకు నివేదికలు పంపించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించాక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.స్థానికంగా ఉన్న గోదావరి బండ్‌ను అభివృద్ధి చేస్తే రోడ్డు మార్గం ఎంతగానో బాగుపడుతుందని మంత్రి దుర్గేష్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.సంబంధిత పూర్తి స్థాయి నివేదికలు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ "గోదావరి పుష్కరాల సమయంలో వచ్చే కోట్లాది మంది భక్తుల రద్దీని నియంత్రించడానికి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడానికి ఈ ఏటిగట్టు రహదారి ఎంతో కీలకం. సుమారు 66 కోట్ల అంచనా వ్యయంతో, 33 కిలోమీటర్ల మేర ఉన్న విజ్జేశ్వరం- సిద్ధాంతం రోడ్డును అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజానీకానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రత్యేకించి నిడదవోలు రూరల్, పెరవలి మండలాలు రవాణా పరంగా మరింత అభివృద్ధి చెందుతాయి" అని వివరించారు. గోదావరి పుష్కరాల నాటికి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా, రవాణా పరంగా సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# పారిశుద్ధ కార్మికులకు దుస్తులు పంపిణీ

**- సర్పంచ్ భవాని బాలకిషన్, ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్**



విజేత గజ్వేల్ : సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో సోమవారం పారిశుద్ధ కార్మికులకు సర్పంచ్ భవాని బాలకిషన్ ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్ ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.వారితో పాటు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్,వార్డు సభ్యులు మ్యాకల శ్రీనివాస్,కొండనోళ్ళ నరేష్,పరిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జూదం ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

విజేత, పాపన్నపేట : పాపన్నపేట మండలం అన్నారం గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న పలువురిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల పరిధి అన్నారం గ్రామ సమీపంలో పలువురు జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ. 3 వేల 490 ల నగదు, ఒక సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా జూదం ఆడితే చట్ట పరంగా చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశం**



విజేత, నిజామాబాద్ ప్రతినిధి : ఖరీఫ్ సీజన్ ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రైతాంగ ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో పాటు ఎరువులు విత్తనాల డీలర్లతో, రైస్ మిల్లర్లతో కలెక్టర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అయితే నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రైవేట్ కంపెనీల ద్వారా మార్కెట్లో చెలామణి అయ్యే అన్ని రకాల విత్తనాలను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడ కూడా నకిలీ విత్తనాలు అనే పదం వినిపించకూడదని, ఈ విషయంలో అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నకిలీ విత్తనాల బెడద లేకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఎవరైనా నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని, కేసులు నమోదు చేసి రికవరీ యాక్టు అమలు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. డీలర్లను ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, ఏ ఒక్క రైతు నకిలీ విత్తనాల వల్ల నష్టపోకూడదు అన్న సంకల్పంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తనిఖీకి వచ్చే అధికారులకు సహకరించాలని డీలర్లకు సూచించారు. జిల్లాకు వ్యవసాయ రంగంలో మంచి పేరు ఉందని, దానిని నిలుపుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎరువులు విత్తనాల దుకాణాలలో తనిఖీలు నిర్వహించిన వివరాలను నివేదిక రూపంలో తనకు ఎప్పటికప్పుడు సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. క్రాప్ బుకింగ్ ఫార్మర్ రిజిస్ట్రీ విషయంలోనూ ఖచ్చితత్వంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో పంట సేకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వ్యవసాయ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత.. - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



విజేత,అనకాపల్లి ప్రతినిధి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి భరోసా కల్పించడమే జిల్లా పోలీస్ లక్ష్యమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 58 ఫిర్యాదులను స్వీకరించారు.వీటిలో భూ తగాదాలు, మోసపూరిత ఘటనలు మరియు ఆస్తి సంబంధిత వివాదాలు,కుటుంబ సమస్యలు మరియు భార్యాభర్తల మధ్య వేధింపులు,వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన పౌర సమస్యలు ఉన్నాయి. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రతి ఫిర్యాదుపై 7 రోజుల్లోపు సమగ్ర విచారణ పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలి అని, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా, కేవలం వాస్తవాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. బాధితులకు తమ ఫిర్యాదుపై చేపట్టిన చర్యల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో నమ్మకాన్ని పెంపొందించాలి అని సూచించారు. విచారణ అనంతరం తీసుకున్న చర్యలకు సంబంధించిన పూర్తి నివేదికను తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి సమర్పించాలి అని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయం అందించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన బాధ్యత అని ఎస్ పి అన్నారు. ముఖ్యంగా మహిళా రక్షణకు పెద్దపీట వేస్తూ, వారిని మోసగించే వారిపై ఉక్కుపాదం మోపుతాం అని, ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై శ్రీనివాస రావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతులను ఉరి గోస పెడుతున్న ప్రభుత్వం

**- బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బుద్ద నాగరాజు..!**



విజేత గజ్వేల్ : వడ్ల కొనుగోలు సక్రమంగా జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగదేవపూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బుద్ద నాగరాజు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారాని నెల రోజులుగా వడ్లు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు,కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారిందనీ పేర్కొన్నారు.వరి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు కేంద్రాల వద్దే కొందరు రైతులు ప్రాణాలు కోల్పోతున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. ఎండ తీవ్రతకు తోడు కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వేచి ఉండడం వల్ల రైతులు గుండెపోటుతో ధాన్యం కుప్పల మీదే కుప్పకూలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి లేదని, వ్యవస్థలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. పంటను త్వరగా కొనుగోలు చేయకుండా రైతులను ఇంకెంత కాలం ఇబ్బంది పెడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని గుర్తు చేశారు. వడ్లు పండించిన రైతులను ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వడ్లు కొన్నట్లే.. ప్రస్తుతం కూడా వాటిని కొనుగోలు చేయాలనీ ప్రభుత్వం ఇకనైనా స్పందించి, తక్షణమే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి రైతుల తిప్పలు తీర్చాలని బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బుద్ద నాగరాజు డిమాండ్ చేశారు.

# దేశానికి ఆదర్శం మన మహిళలు

- **ఒకేరోజు 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాల నిర్మాణం**
- **త్వరలోనే ఇందిరా మహిళా శక్తి కార్పొరేట్ సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్లు, గోదాములు, రైస్ మిల్లులు**
- **సచివాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



విజేత, నిజామాబాద్ ప్రతినిధి : 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 'మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుంది, కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుంది, గ్రామం బలపడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది.. ' అన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సీఎం అన్నారు. అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సీఎం ఆవిష్కరించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి , ఎంఎల్ఏలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందని, వడ్డీ లేని రుణాలకు ఇప్పటికే రూ.1,390 కోట్లను చెల్లించిందన్నారు. మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు. వాటికి అవసరమైన చోట భూములను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి సిద్ధమని అన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలని సీఎం అన్నారు. సంఘాలే వడ్లు కొనుగోలు చేసి, బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారులుగా ఉంటారని, వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. డీమార్ట్, బిగ్‌బజార్‌లకు పోటీగా ఉండేలా అద్భుతమైన మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పట్టణాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలి, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలి, మహిళా సంఘాలకు ఆదాయం రావాలి అన్నదే ఈ ఆలోచన వెనుక ఉన్న లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా శక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుందని, రైతులు పండించే మంచి పంటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, నిత్యావసర సరుకులు వీటి ద్వారా వినియోగదారులకు చేరేలా చూడాలని అన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తే రైతులకు మేలు జరుగుతుందని, వినియోగదారునికీ నాణ్యమైన వస్తువు, మహిళా సంఘాలకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఒకే రోజు, ఒకే సమయంలో 8 వేల భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణయమని సీఎం అన్నారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే కేవలం సమావేశాల స్థలం ఇవ్వటం కాదని, వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు, వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను నిర్మించడమని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోందని అన్నారు. మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి మార్గమని భావించి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఈ పథకంలో ఆర్టీసీకి రూ.10 వేల కోట్ల వరకు చెల్లించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవసరం లేదని కొందరు రెచ్చగొట్టారని, ఈ పథకాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేశారని విమర్శించారు. మహిళల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని, ఆ కుట్రలను తిప్పికొట్టి ఉచిత ప్రయాణాన్ని కొనసాగించిందని అన్నారు. మహిళలను బస్సులను యజమానులుగా మార్చాలన్న ఆలోచనతో మహిళా సంఘాల ద్వారా 1000 బస్సులు కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ప్రణాళికను అమలు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సోలార్ ఎనర్జీ అనగానే అదానీ, అంబానీ వంటి పెద్ద సంస్థలే గుర్తుకు వచ్చే పరిస్థితి మారిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం 1000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రిలయన్స్ వంటి సంస్థలు నిర్వహించే పెట్రోల్ బంకుల వ్యాపారంలోనూ సంఘాలను భాగస్వాములుగా చేస్తున్నామని సీఎం వెల్లడించారు. జిల్లా కేంద్రాల్లో, ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఓ సాయన్న, డీ డబ్ల్యూఓ పద్మ, జిల్లా, మండల సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.